
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
బుధవారం 4 జూన్ 2025



## 55 గ్రామాలు.. 3,263 దరఖాస్తులు

నల్లగొండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో భాగంగా తొలిరోజైన మంగళవారం జిల్లావ్యాప్తంగా 55 గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా, 3,263 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా పెద్దసంఖ్యలో సాదాబైనామాల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మరోసారి భూభారతి కింద దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఈక్రమంలో గ్రామాల్లో సభ నిర్వహించి, భూసమస్యలపై వినతిపత్రాలు తీసుకుంటున్నారు. రైతులు సైతం తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తున్నారు.

# ఎటూ పాలుపోవడంలేదు

- ఇబ్బంది పడుతున్న పాడి రైతులు
- వ్యవసాయ, కుటుంబ అవసరాలకూ ఇబ్బందులే



మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామానికి చెందిన పైళ్ల కవిత స్థానిక సొసైటీలో సభ్యురాలు. గతంలో ఆమె ఆ సొసైటీలో సుమారు 20 లీటర్లపైన పాలు పోసేవారు. ఎండాకాలం కావడంతో పశువులు పాలు అంతగా ఇవ్వడంలేదు. ఇప్పుడు రోజు 6 లీటర్ల గేదె పాలు, ఐదు లీటర్లు ఆవు పాలు పోస్తున్నారు. వెన్న శాతాన్ని అనుసరించి గేదె పాలు లీటరు రూ.65, ఆవు పాలు లీటరు రూ.36 తీసుకుంటున్నారు. రోజుకు సుమారు రూ.570 చొప్పున మూడు నెలలకు రూ.51,300 వేల బిల్లు రావాల్సి ఉంది. 15 రోజులకు ఒకసారి బిల్లు ఇవ్వకపోవడంతో కుటుంబ ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నారు. పశువులకు దాణా కొనడానికి, ఇతర ఖర్చులకు అప్పు చేయాల్సి వస్తుంది. నాలుగేళ్లుగా బోనస్ రావడంలేదు. రూ.2లక్షలపైగా బోనస్ రావాల్సి ఉంది. మదర్ డెయిరీ బకాయి బిల్లులు చెల్లించాలని ఆమె కోరుతున్నారు.

6

- (ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

# 15 లోగా ఫిట్‌నెస్ పరీక్ష

పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్‌పై ఆర్టీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాలల నుంచి ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సుల కళాశాలలున్నాయి. నిత్యం బస్సుల్లో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. రోడ్డు ప్రమాదాల నివారణపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది. కొద్దిపాటి నిర్లక్ష్యంతో అత్యంత విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ప్రమాదాల భారిన పడిన ఎన్నో కుటుంబాలు తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)




- ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులపై ఆర్టీఏ దృష్టి
- ఈ నెల 15వరకు అవకాశం

ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ లేకపోవడం, అనుభవంలేని డ్రైవర్లను నియమించడంతో జిల్లాలో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులపై ఆర్టీఏ దృష్టి సారించింది. రోడ్డు రవాణా శాఖ అధికారులు జిల్లావ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు 171 ఉండగా, ఇంటర్ కళాశాలలు 30, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో 16, ఇంజినీరింగ్, తదితర వృత్తి విద్యా కళాశాలలు 25వరకు ఉన్నాయి. ఈ విద్యాసంస్థలకు చెందిన బస్సులు 180 వరకు నడుస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల కు చెందిన బస్సులను ప్రతీ సంవత్సరం విధిగా ఫిట్‌నెస్ చేయించుకోవాలి. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబరు వరకు ఫిట్‌నెస్ చేసుకోవాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు విధిగా విద్యా సంస్థలకు చెందిన బస్సులను ఫిట్‌నెస్ చేసుకోవాలని సూచించారు. ఫిట్‌నెస్ వెంటనే చేయించుకోవాలని రవాణా శాఖ అధికారులు సంబంధిత పాఠశాలల యాజమన్యాలకు సమాచారాన్ని అందించారు. ఈ నెల 15వ తేదీలోగా ఫిట్‌నెట్ చేసుకోవాలని గడువు విధించారు. ఈ మేరకు జిల్లాలోని..

- మిగతా 8వ పేజీలో...

### 15లోగా ఫిట్‌నెస్ చేయించాలి



ఈ నెల 15వ తేదీలోగా పాఠశాల, కళాశాలల బస్సులకు ఫిట్‌నెట్ సర్టిఫికెట్ పొందాలి. చిన్నారుల భద్రత దృష్ట్యా 15సంవత్సరాల కాలం చెల్లిన వాహనాలకు అనుమతి లేదు. ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రం లేకపోతే 15వ తేదీ తర్వాత రోడ్లపై నడిపే పాఠశాల బస్సులకు సంబంధించి ప్రత్యేక బృందాలు కేసులు నమోదు చేస్తాయి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయి.

- డీటీవో లావణ్య

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

### విచారణకు వెళ్లి వస్తూ
## హెడ్ కానిస్టేబుల్ మృత్యువాత

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృత్యవాత పడ్డారు. విధి నిర్వహణలో భాగంగా ద్విచక్ర వాహనంపై విచారణకు వెళ్లి తిరిగి పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న కనగల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ బొల్లెపల్లి సైదులుగౌడ్ మృతిచెందాడు. ఓ పిటిషన్ విచారణ నిమిత్తం ఆయన జీచెన్నారం గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో దర్వేశిపురం స్టేజీ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు.

6

## శివన్నగూడెం నుంచి లిఫ్ట్ నీటిని తరలిస్తాం



డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు లిఫ్ట్ ద్వారా నీటిని అందిస్తామని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

వివరాలు 7లో

# మీ వల్లే అప్రతిష్ఠపాలు

### కేతేపల్లి రెవెన్యూ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కేతేపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కిందిస్థాయిలో మీరు చేసే పొరపాట్లతో జిల్లా యంత్రాంగం అప్రతిష్ఠపాలవుతుందని కేతేపల్లి మండల రెవెన్యూ అధికారులపై కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆగ్రహం వ్యక్తం చేశారు. భూభారతి దరఖాస్తులను పరిష్కరించడంలో మండలస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో, రైతులు పురుగుల మందు డబ్బాలతో జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణికి వస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ కేతేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సంబంధిత సమస్యలపై అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. భూభారతి చట్టం కింద ఏదేని రైతు తమ సమస్య పరిష్కారానికి ప్రజావాణికి వచ్చి ఆత్మహత్యకు యత్నిస్తే సంబంధిత మండలాల వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎవరి స్థాయిలో వారు రైతుల సమస్యలను పరిష్కరిస్తే ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావన్నారు. తక్షణం పరిష్కరించే వాటిని కూడా తాత్సారం చేస్తే రైతుల నుంచి నిరసనలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మండలంలోని 16గ్రామాల్లో ఎన్ని సర్వేనెంబర్లకు డిజిటల్ సైన్(డీఎస్) పెండింగ్ ఉందని ఇన్‌చార్జి తహసీల్దార్ మహ్మద్ అబ్దుల్‌సత్తార్‌ను ప్రశ్నించారు. ఆయన చెప్పిన సమాధానం విన్న కలెక్టర్ వాటి పరిష్కారానికి మీస్థాయిలో మీరు తీసుకున్న చర్యలేంటని ప్రశ్నించారు. అనంతరం మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిలో మీరు తక్షణం పరిష్కరించేవి ఎన్ని, జిల్లాస్థాయిలో పరిష్కారమయ్యేవి ఎన్ని ఉన్నాయని ఆరా తీశారు. సమీక్షా సమావేశంలో ఎంపీడీవో బీ.శ్రీనివారావు, ఎంఆర్ఐ ఎన్.వెంకన్న, ఏఆర్ఐ ఏ.రామచంద్రయ్య, సర్వేయర్ బీ.వెంకటేశ్వర్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో సహా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ముగింపు దశలో ధాన్యం కొనుగోళ్లు

- నేడో, రేపో డిండిలో కొనుగోళ్లతో ఆఖరు
- లక్ష్యానికి మించి ధాన్యం సేకరణ
- రాష్ట్రంలో జిల్లాకు 2వస్థానం

నల్లగొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ప్రక్రియ చివరి దశకు చేరింది. రైతు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విధంగానే జిల్లా వ్యాప్తంగా లక్ష్యానికి మించి ధాన్యాన్ని సేకరించారు. 375 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి కొనుగోళ్లు చేపట్టారు. డిండిలో మాత్రం ఆరు మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉంది. బుధ, గురువారాల్లో అక్కడి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణతో ఈ ప్రక్రియ పూర్తిగా ముగియనుంది. జిల్లాలో యాసంగిలో 5,97,729మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు గాను దాదాపు 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రాష్ట్రంలో జిల్లాను రెండవ స్థానంలో నిలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పౌరసరఫరాల సంస్థ, పౌరసరఫరాల శాఖలు ప్రణాళికబద్ధంగా ముందుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని వేగవంతంగా సేకరించాయి. మార్చి 24న జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాగా పలుమార్లు అకాలవర్షాలతో కూడా రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు.

### 84,619మంది రైతుల నుంచి

జిల్లావ్యాప్తంగా యాసంగి సీజన్‌లో ధాన్యం దిగుబడులు పెద్దఎత్తున వచ్చిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏర్పాట్లుచేశారు. ప్రభుత్వ రంగ సంస్థలో ధాన్యాన్ని విక్రయిస్తే మద్దతు ధరతో పాటు సన్న రకానికి బోనస్ కూడా వస్తున్న నేపథ్యంలో రైతులు అత్యధికంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించారు. సుమారు 5,76,208మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యంతో పాటు 23,700మెట్రిక్ టన్నులకు పైగా సన్నధాన్యాన్ని ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలుచేశాయి. మొత్తం 84,619మంది



రైతుల నుంచి ధాన్యాన్ని అధికార యంత్రాంగం కొనుగోలు చేసింది. ఇందుకు సంబంధించి రూ.1325కోట్లను రైతులకు చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో రూ.1210కోట్లకు పైగా నగదును జమచేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేపట్టాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో అధికారయంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ధాన్యాన్ని సవ్యంగా కొనుగోళ్లు చేపట్టారు. మొదట లారీలు సకాలంలో అందుబాటులోకి రాక ఎగుమతికి ఇబ్బందికావడం, మిల్లర్ల వద్ద స్థలం లేక దిగుమతి ఆలస్యం వంటి సంఘటనలు జరిగాయి. అయితే ఆ తరువాత సరైన చర్యలు చేపట్టడంతో ధాన్యం కొనుగోళ్లకు ఆటంకాలు తొలగాయి. రైతులకు సన్నరకానికి సంబంధించి బోనస్ చెల్లించాల్సి ఉంది. క్వింటాళ్లకు రూ.500ల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులకు ధాన్యం కొనుగోళ్లు, అందుకు సంబంధించిన డబ్బులను చెల్లించడం కోసం ప్రత్యేకంగా కలెక్టరేట్‌లో సెల్ ఏర్పాటు చేసి ట్రోల్ ఫ్రీ నెంబర్ కూడా అందుబాటులో ఉంచారు.

## భూసమస్యల పరిష్కారం కోసమే భూభారతి



రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరావు

చండూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎటువంటి భూసమస్యలు తలెత్తకుండా పరిష్కరించడం కోసమే ప్రభుత్వం ఈ భూభారతి పోర్టల్‌ను ప్రవేశపెట్టిందని అదనపు కలెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం తుమ్మలపల్లి గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించి, మాట్లాడారు. గ్రామాల్లో రైతులు, భూమి పట్టాదారులు తమ పాస్‌పుస్తకాలలో, భూరికార్డులలో ఎటువంటి తప్పులు ఉన్నా మరే విధమైన భూసమస్యలు ఉన్నా సదస్సులో దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. అదేవిధంగా ఈ రెవెన్యూ సదస్సులో భాగంగా మొదటిరోజు తుమ్మలపల్లి గ్రామంలో రైతుల నుంచి 17 దరఖాస్తులు, కుమ్మన్‌దానిగూడెం నుంచి 1 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ కిరణ్మయి, డిప్యూటి తహసీల్దార్ నిర్మలాదేవి తెలిపారు.

### సకల సదుపాయాలతో భవిత కేంద్రాలు

చండూరు : సకల సదుపాయాలతో భవిత కేంద్రాలను నిర్మించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. చండూరులో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థు కోసం ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న భవిత కేంద్రం పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు తగినవిధంగా కృత్యాధార పద్ధతిలో బోధనకు సకల సదుపాయాలను సమకూర్చాలని ఆదేశించారు. ఈ నెల 6వ తేదీ నుంచి 19తేదీ వరకు చేపట్టే బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచాలని సూచించారు. ఆయన వెంట చండూరు ఇన్‌చార్జి ఆర్డీవో రమణారెడ్డి, డీఈవో బిక్షపతి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటం




సీపీఐ మండల మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

దేవరకొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఐ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతోందని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకొండ మండలం గొట్టిముక్కలలో నిర్వహించిన సీపీఐ దేవరకొండ మండల 14వ మహాసభలో ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యంతో కలిసి మాట్లాడారు. శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని, దున్నేవాడిదే భూమి కావాలని, శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పేదలపక్షాన సీపీఐ పోరాడుతోందన్నారు. ప్రజా సమస్యలే ఏజెండాగా నిత్యం ప్రజల ఉంటూ పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించిందన్నారు. పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తు రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెంచి ప్రజలపై భారం మోపుతోందని విమర్శించారు. ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలన్నారు. ఎస్ఎల్‌బీసీ, డిండి, పెండ్లిపాకల, నక్కలగండి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి భూనిర్వాసితులకు పునరావాసం కల్పించి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధానకార్యదర్శి పల్లె నర్సింహ, అంజయ్యనాయక్, దేప సుదర్శన్‌రెడ్డి, నూనె రామస్వామి, పల్లా సులోచన, రంగారెడ్డి, జ్యోతిబసు పాల్గొన్నారు.

### నేటి నుంచి దర్వేశిపురం
## ఎల్లమ్మ జాతర

- 6న తేదీన కల్యాణోత్సవం, హాజరుకానున్న మంత్రులు

వివరాలు 7లో

# విత్తనరంగంలో స్వయం సమృద్ధి చెందాలి

- జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్స్‌లర్, ప్రొఫెసర్ ఏ.జానయ్య
- నాణ్యమైన విత్తనాలతో స్వయం సమృద్ధి

తిప్పర్తి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన విత్తనంతో ఉత్పత్తి చేస్తే తిరిగి అదే విత్తనాన్ని ఇతర రైతులకు ఇవ్వడం ద్వారా విత్తన రంగంలో స్వయం సమృద్ధి సాధించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్ ఏ జానయ్య అన్నారు. రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 'నాణ్యమైన విత్తనం-రైతు నేస్తం' పేరుతో ఫౌండేషన్ విత్తనాల పంపిణీని చేపట్టింది. ఇందులో భాగంగా మంగళవారం తిప్పర్తి మండలకేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రెండు, మూడేళ్లలో విత్తనరంగంలో విత్తనరంగంలో స్వయం సమృద్ధి సాధించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఆశయమన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో నాణ్యమైన విత్తనాలను రూపొందించి రాష్ట్రంలోని 11వేల రెవెన్యూ గ్రామాల్లోని 40వేల మంది రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ విత్తనాలతో రైతులు మంచి పంటలు పండించి వచ్చే సీజన్‌కు వారు ఆ విత్తనాలను వినియోగించుకోవడంతో పాటు ఇతర రైతులకు విత్తనం ఇస్తే ఎలాంటి ఇబ్బందులు



రైతులకు ఫౌండేషన్ సీడ్ అందజేస్తున్న వైస్‌ఛాన్స్‌లర్, ప్రొఫెసర్ జానయ్య, కలెక్టర్ ఇలా త్రిపాఠి

లేకుండా మంచి దిగుబడులు పొందవచ్చన్నారు.

### నాణ్యమైన విత్తనాలతో నాణ్యమైన పంటలు

నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు రావడానికి వీలుంటుందని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని 564 రెవెన్యూ గ్రామాల్లో రైతులకు ఇన్‌పుట్ సీడ్‌ను అందజేస్తామన్నారు. జిల్లాలో 12లక్షల ఎకరాల్లో వ్యవసాయ సాగుకు అవకాశం ఉందని, అందులో భాగంగా రైతులు నకిలీ విత్తనాల బారినపడి మోసపోతున్నారని, అలా కాకుండా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా విత్తనాలు పంపిణీ చేయడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు.

### ప్రభుత్వం చొరవ చూపాలి...

రెండవ పంటలో రైతులు పప్పుధాన్యాలు, ఇతర పంటలు సాగు చేసేలా ప్రభుత్వమే చొరవ చూపాలని వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరైన కనగల్లు మండల రైతు పల్లేటి రాంరెడ్డి అన్నారు. పప్పుధాన్యాలతో పాటు ఈ ప్రాంతంలో డిమాండ్ ఉన్న కంది విత్తనాలను కూడా ప్రభుత్వం పంపిణీ చేస్తే రైతులకు మేలు జరుగుతుందని రైతు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ సంచాలకులు, శాస్త్రవేత్తలు,వ్యవసాయ అధికారులు మేలైన విత్తనం ఎంపిక,వాటి ప్రయోజనాలు, వరికి బదులుగా వేసే ప్రత్యామ్నాయ పంటలు, పురుగుమందుల వాడకం తగ్గింపు, తదితర అంశాలపై రైతులకు వివరించారు. అనంతరం కలెక్టర్ విశ్వవిద్యాలయ ఉపకులపతితో కలిసి రైతులకు వరి ఫౌండేషన్ సీడ్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్, మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, జూకూరి రమేష్, పాశం సంపత్‌రెడ్డి, ఏవో సన్నిరాజు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

### నిర్మాణ పనుల పరిశీలన...

తిప్పర్తి ప్రాథమిక పాఠశాల్లో నిర్మాణంలో ఉన్న ఎమ్మార్సీ భవనం, భవిత కేంద్రం పనులను కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. అనంతరం అనిశెట్టిదుప్పలపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సుకు హాజరై రైతులతో మాట్లాడి, వారి దరఖాస్తులను పరిశీలించారు.

### భారతీయ కుటుంబ వ్యవస్థ
## ప్రపంచానికే ఆదర్శం

- ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్ మురళీధర్‌రెడ్డి

భువనగిరిటౌన్,జూన్ 3(ఆంధ్రజ్యోతి): భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శమని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్ పీ.మురళీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రమైన భువనగిరిలో ఆర్ఎస్ఎస్ ప్రాథమిక శిక్షావర్గ సమారోహ్‌లో ఆయన మాట్లాడారు. కుటుంబ సభ్యులంద రూ కలిసిమెలిసి ప్రేమతో ఉండాలని, ప్రపంచంలోని అన్నిదేశాల ప్రజలు కోరుకుంటున్నారన్నారు. రామాయణ, మహాభార తం, వేదాలు తదితర భారతీయ ఇతిహాసాల ను, నైతిక విలువలను, ధర్మం, కర్తవ్యం, బాధ్యతలు తదితర అంశాలపై పిల్లలకు బో ధించకపోతున్న ఫలితమే నేటి దుష్పరిణామాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నల్లగొండ విభాగ్ సహ సంఘచాలక్, ఇటుక ల కృష్ణయ్య, జిల్లా సంఘ చాలక్ బాదం ప్రకాశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అ శోక్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి, రవీందర్, వేముల అశోక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్‌రెడ్డి

## గీత వృత్తిని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

నల్లగొండ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గీత వృత్తిని ఆధారం చేసుకొని జీవిస్తున్న వారికి ఆ వృత్తిని నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వాలు తీరని అన్యాయం చేస్తున్నాయని గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి విమర్శించారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాలను వెంటనే విడుదల చేయాలన్నారు. వన పెంపకంలో తాటి ఈత ఖర్జూర చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను అరికట్టాలన్నారు. ట్యాంక్ బండ్‌పై స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఎంపీ ధర్మబిక్షం విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలోని నీరా ప్రాజెక్టును పునరుద్ధరించి, ధర్మబిక్షం పేరు పెట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల ఐడెంటిటీ కార్డులు, లైసెన్సులను వెంటనే జారీ చేయాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు మాట్లాడుతూ చనిపోయిన గీతా కార్మికుల పెన్షన్‌ను భార్యలకు వితంతు పింఛనుగా మార్చి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి సురిగి చలపతి, నాయకులు వనం వెంకన్న, నకరికంటి స్వామి, లెనిన్, అక్కలయ్య పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి

## మా భూమి నిర్వాసితులకు కేటాయించొద్దు



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దేవరోనితండా, జాన్‌తండా రైతులు

దేవరకొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా తాము సాగుచేసుకుంటున్న భూమిని పెండ్లిపాకల రిజర్వాయర్ భూ నిర్వాసితులకు ఇవ్వాలనే ఆలోచనను విరమించుకోవాలని దేవరోనితండా, జాన్‌తండా రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈమేరకు నల్లగొండ జిల్లా దేవరకొండ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా జాన్‌తండా మాజీ సర్పంచ్ రమేష్, రైతులు నాగరాజు, నర్సింహనాయక్, కోట్యానాయక్, బాలునాయక్ మాట్లాడుతూ కొండమల్లేపల్లి మండలంలోని జాన్‌తండా శివారు సర్వే నంబర్ 86లో ఉన్న 110ఎకరాల ప్రభుత్వ భూమికి అప్పటి ప్రభుత్వం పట్టా, పాస్‌పుస్తకాలు ఇచ్చినట్లు చెప్పారు. సదరు భూమిలో సాగు చేసుకొని తమ కుటుంబీకులు జీవనం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల రెవెన్యూ, నీటి పారుదలశాఖ అధికారులు సర్వేనెంబర్ 86లో 35ఎకరాలు పెండ్లిపాకల రిజర్వాయర్ భూనిర్వాసితులకు పట్టాలు ఇచ్చేందుకు సర్వే చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన భూములను వదులుకునే ప్రసక్తే లేదని, ఆ ఆలోచనను విరమించుకొని మరో ప్రాంతంలో భూనిర్వాసితులకు భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో రమణారెడ్డి రెవెన్యూ సదస్సులో ఉండటంతో రైతులతో ఫోన్‌లో మాట్లాడి రైతుల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని హామీఇచ్చారు. తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తామని రైతులు ఆందోళన విరమించారు.

## గడ్డివాము దగ్ధం

నేరేడుచర్ల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామంలో మంగళవారం గడ్డివాము దగ్ధమైంది. బాధితుడు మాతంగి రాముకు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి పక్కనే గడ్డివాము ఏర్పాటు చేసుకున్నాడు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. దీంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చాడు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలలు ఆర్పారు. దగ్ధమైన గడ్డి విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

## విద్యుదాఘాతానికి రెండు మూగజీవాలు బలి

అర్వపల్లి, భూదాన్‌పోచంపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గేదె మృతిచెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన బొడ్డు సింహాద్రికి గేదె మంగళవారం ఉదయం మేతకు వెళ్లి విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన పాడిరైతు వంగేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రూ.లక్ష విలువైన పాడిగేదె మంగళవారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. వంగేటి శ్రీనివాస్‌రెడ్డి భార్య హంసమ్మ తన పాడి గేదెలను మేత కోసం తీసుకెళ్తుండగా అదే గ్రామానికి చెందిన బందారపు అంజయ్య పొలంలో ఇటీవల నూతనంగా నిర్మించిన కరెంటు పోల్స్‌కు ఇన్సులేటర్లు ఇవ్వకుండా విద్యుత్ అధికారులు నేరుగా కనెక్షన్ ఇచ్చారు. కరెంట్ ఓవర్‌లోడ్‌తో విద్యుత్ వైరుతెగి కిందపడింది. తీగెకు తగిలి ఓ గేదె మృతిచెందింది.

## యువకుడి బలవన్మరణం

సూర్యాపేటక్రైం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లాకేంద్రంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట అఫ్జల్‌రైస్ మిల్ ప్రాంతానికి చెందిన సారగండ్ల సాయికుమార్ అలియాస్ ఆంజనేయులు(29) మూడు సంవత్సరాలుగా పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ఐఫోన్‌టెక్(ఆండ్రాయిడ్ హార్డ్వేర్ సాఫ్ట్‌వేర్) అనే పేరుతో దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇటీవల అతను ప్రేమ వివాహం చేసుకున్నట్లు తెలుస్తోంది. సాయికుమార్ మృతిపై బంధువులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

తుంగతుర్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల పరిధిలోని గానుగుబండ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన గీతకార్మికుడు పంజాల సోమయ్య సోమవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కడానికి వెళ్లాడు. తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తుండగా ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి జారిపడడంతో నడుము వెన్నుపూస, చేయి విరగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నాడు.

## పోషణ కరువై.. యాచకుడిగా మారి



పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల సంరక్షణలో ఆగమయ్య

భువనగిరి టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా పోచంపల్లి మండలకేంద్రానికి చెందిన కన్నె ఆగమయ్య(72) కుటుంబ సభ్యుల పోషణకు దూరమై భువనగిరి పట్టణంలో యాచిస్తూ జీవనం సాగిస్తున్నాడు. తనకు న్యాయం చేయాలంటూ జనవరి 27వ తేదీన ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నాడు. అయినప్పటికీ ఎలాంటి ఓదార్పు లభించని ఆగమయ్య స్థితిని గమనించిన తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎర్రగుంట వెంకటేశం, ఇతర సభ్యులు మంగళవారం అతడిని భువనగిరి పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం. రమేష్‌కుమార్ జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావుకు సమాచారం ఇచ్చారు. దీంతో జిల్లా సంక్షేమ అధికారి సూచనల మేరకు పోలీసులు ఆగమయ్యను పెద్దకొండూరులోని వయోవృద్ధుల అనాథాశ్రమంలో చేర్చారు.

## బెదిరిస్తున్నాడని ప్రాణం తీశారు..



రమేష్(ఫైల్)

చౌటుప్పల్ రూరల్, జూన్3(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట శివారులో గత నెల 28న జరిగిన హత్య చేసిన మిస్టరీని పోలీసులు ఛేదించారు. నిందితులను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ సైదాబాద్‌కు చెందిన మారోజు రమేశ్(33) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. హైదరాబాద్ చంపాపేటకు చెందిన లెంకల భాస్కర్(30) వద్ద రమేశ్ ఆటో అద్దె తీసుకుని నడుపుతున్నాడు. రమేశ్ భార్యకు భాస్కర్‌తో వివాహేతర సంబంధం ఉందని అనుమానంతో భాస్కర్‌తో పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీ పెట్టించాడు. గత నెల 28న రమేశ్ భాస్కర్ ఇంటికి వెళ్లి భాస్కర్ కుటుంబ సభ్యులను బెదిరించాడు. తరుచూ రమేశ్ తనను బెదిరించడంతో భాస్కర్ రమేష్‌పై పగ పెంచుకున్నాడు. హైదరాబాద్ మిదానికి చెందిన రియాజ్‌కు ఫోన్ చేసి బెదిరింపు విషయంపై భాస్కర్ సమాచారం ఇచ్చాడు. రియాజ్ రమేశ్‌కు ఫోన్ చేసి సరూర్‌నగర్‌లోని ఓ బార్‌కు తీసుకెళ్లాడు. రమేశ్, భాస్కర్, రియాజ్‌లు కలిసి మద్యం తాగారు. అదే రాత్రి మద్యం కోసమని బైక్‌పై చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటకు వచ్చారు. మధ్యలో మద్యం సేవించారు. తూప్రాన్‌పేట శివారులోని గ్రీన్‌సిటీ వెంచర్‌లోకి వెళ్లి మళ్లీ మద్యం తాగారు. ఇదే అదునుగా భావించి రమేష్ తలపై కర్రతో కొట్టారు. రమేశ్ పారిపోతుండగా పట్టుకుని బియ్యం బస్తాతో ఉరేసి చంపేశారు. అక్కడి నుంచి భాస్కర్, రియాజ్ పారిపోయారు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో భాస్కర్, రియాజ్ బైక్‌పై చౌటుప్పల్‌కు వస్తుండగా తూప్రాన్‌పేట వద్ద తనిఖీలు నిర్వహించిన పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులు నేరాన్ని అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# ఎటూ పాలుపోవడం లేదు

● పాడి రైతులకు అందని పాల బిల్లులు ● మూడు మాసాలుగా బిల్లులు చెల్లించని మదర్ డెయిరీ ● లీటర్‌కు రూ.4 బోనస్‌కు మంగళం..?



**రైతు దేశానికి వెన్నుముక. ఆ రైతుకు వెన్నుముక పాడి. ఆ రైతులకు పాల బిల్లులు చెల్లించకుండా మదర్ డెయిరీ జాప్యం చేస్తోంది. ప్రతి 15 రోజులకు ఒకసారి పాడి రైతులకు బిల్లు చెల్లించాల్సి ఉంది. మార్చి నుంచి ఇప్పటి వరకు మూడు మాసాలుగా (ఆరు బిల్లులు) బిల్లు చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచింది. అవసరానికి డబ్బులు అందకపోవడంతో పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు.**

● (ఆంధ్రజ్యోతి మోత్కూరు)

కూలీలకు, వ్యాపారులకు రోజు వారీగా, ఉద్యోగులకు నెలనెలా ఆదాయం(వేతనం) వస్తుండగా, రైతుకు పంట దిగుబడి వచ్చే వరకు పెట్టుబడికి ఖర్చు పెట్టడమే తప్ప దమ్మిడి ఆదాయం రాదు. పంట దిగుబడి రావడానికి ఐదారు మాసాలు పడుతుంది. అప్పటి వరకు కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఇతర ఖర్చులకు అవసరమొస్తుందని రైతులు వ్యవసాయానికి అనుబంధంగా ఆవులనో, గేదెలనో సాకుతున్నారు. పాలు తాగే కుటుంబాలకు అమ్ముకోవాలంటే ఇంటింటికి తిరిగి పోయాలి. అందరూ ఒకేసారి బిల్లు ఇవ్వరు. ఒకేసారి బిల్లు వస్తే అవసరాలకు ఉపయోగపడుతుందని, ఇంటింటికీ తిరిగి పాలు పోయలేక రైతులు పాల సంఘాలకు పాలు పోస్తున్నారు. సంఘాలు పాడి రైతులకు ప్రతి 15రోజులకోసారి బిల్లు చెల్లించాల్సి ఉంది. మదర్ డెయిరీ యాజమాన్యం గత మార్చి నుంచి ఇప్పటివరకు మూడు మాసాలుగా ఆరు బిల్లులు చెల్లించ లేదు. ఇప్పుడు జూన్ మాసం. ఈ నెలలో పిల్లల చదువు లకు పాఠశాలలు, కళాశాల ఫీజులు, దుస్తులు, పుస్తకాలు తదితర ఖర్చులు ఉంటాయి. ఇదీ ఖరీఫ్ పంటల సాగు సీజన్ కూడా. పంటల సాగు ఖర్చులు ఉంటాయి. మూడు మాసాలుగా బిల్లు అందక ఇబ్బందులు పడుతున్నారు. తమకు రావాల్సిన డబ్బు రాక కుటుంబ అవసరాల కోసం అప్పులు చే యాల్సివస్తోందని, అప్పులకు వడ్డీ అవుతోందని ఆవేదన చెందుతున్నారు.

### మదర్ డెయిరీ ఆధ్వర్యంలో 300 సొసైటీలు

ఉమ్మడి నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల్లో మదర్‌డెయిరీ పరిధిలో 24 పాల శీతలీకరణ కేంద్రాలు, సుమారు 300సొసైటీలు(పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు) ఉన్నాయి. ఈ సంఘాల్లో సుమారు 65 వేల మంది రైతులు(సభ్యులు) ఉన్నారు. సొసైటీల ద్వారా రోజుకు సుమారు 60 వేల నుంచి 70 వేల లీటర్ల పాలు సేకరిస్తోంది.

### రైతుల ఆందోళన బాట

మదర్ డెయిరీ మూడు మాసాలుగా పాడి రైతులకు బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు ఆందోళన బాట పట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం రాగిబావి గ్రామానికి చెందిన పాడి రైతులు ఇటీవల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మోత్కూరు పాలశీతలీకరణ కేంద్రానికి తాళం వేశారు. తమకు బిల్లులు చెల్లించే వరకు తాళం తీసేది లేదని ఆందోళన చేశారు. పాలు తీసుకెళ్లడానికి వచ్చిన పాల ట్యాంకర్‌ను కేంద్రంలోకి వెళ్లనివ్వలేదు. దీంతో దిగొచ్చిన అధికారులు ఆ రైతులకు ఒక నెల బిల్లు రూ.1.50 లక్షలు అప్పటికప్పుడు చెక్కురాసి ఇచ్చి చెల్లించారు.

### పాడి రైతులకు రూ.35.10 కోట్లు బాకీ

మదర్ డెయిరీ రోజూ సుమారు 60వేల నుంచి 70వేల లీటర్ల పాలు సేకరిస్తోంది. వెన్న శాతాన్ని బట్టి లీటరు రూ.40 నుంచి రూ.100 రేటు చెల్లిస్తారు. సగటున రోజుకు 60వేల లీటర్ల పాలు డెయిరీకి వస్తాయనుకున్నా, లీటరుకు సగటున రూ.65చొప్పున లెక్కిం చినా రోజుకు రూ.39లక్షల బిల్లు అవుతుంది. 15రోజులకు రూ.5.85 కోట్లు అవుతుంది. మూడు మాసాలకు ఆరు బిల్లులు రూ.35.10 కోట్లు చెల్లించాల్సి ఉంది.

### బోనస్‌కు మంగళం..?

పాడి రైతులను ప్రోత్సహించడానికి, వారు నష్టాల పాలు కాకుండా ఆదుకోవడానికి 2017 నవంబరులో అప్పటి సీఎం కేసీఆర్ లీటరు పాలకు రూ.4 బోనస్ ఇస్తామని ప్రకటించారు. కొన్నేళ్లుగా గత ప్రభుత్వంతో పాటు, ఈ ప్రభుత్వం కూడా పాడి రైతులకు బోనస్ చెల్లించకపోవడంతో బోనస్‌కు మంగళం పాడినట్టేనంటున్నారు. తమకు పక్కాగా జ్ఞాపకం లేదగాని ఐదేళ్లుగా బోనస్ రావడం లేదని కొందరు, నాలుగేళ్లుగా రావడం లేదని మరికొందరు పాడి రైతులు చెబుతున్నారు. రోజుకు 60వేల లీటర్లకు రూ.4 చొప్పున రూ.2.40లక్షలు, ఏడాదికి రూ.8.76కోట్లు, నాలుగేళ్లకు లెక్కించినా రూ.35.04కోట్లు బోనస్ చెల్లించాల్సి ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.



మోత్కూరు పాల శీతలీకరణ కేంద్రానికి తాళం వేసిన పాడి రైతులు (ఫైల్)

## లక్ష్మీనర్సింహారావుకు డాక్టర్ ఆఫ్ సోషల్ వర్కర్ అవార్డు

చౌటుప్పల్ రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం గ్రామానికి చెందిన పంతంగి లక్ష్మీనర్సింహారావు డాక్టర్ ఆఫ్ సోషల్ వర్కర్ అవార్డు అందుకున్నారు. జర్మనీకి చెందిన యునైటెడ్ నేషన్స్, ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ అవార్డు ప్రకటించింది. తమిళనాడు రాష్ట్రం ఊటిలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీనర్సింహారావుకు ఆ సంస్థ ప్రతినిధులు అవార్డు అందజేశారు. 20సంవత్సరాలుగా వివిధ సామాజిక పర్యావరణ వాతావరణ మార్పుల సమస్యలపై సేవలు అందించినందుకు అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సేవలు గుర్తించి డాక్టర్ ఆఫ్ సోషల్ వర్కర్ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు.



అవార్డు అందుకుంటున్న లక్ష్మీనర్సింహారావు

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి



సైదులుగౌడ్ (ఫైల్)

కనగల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో భాగంగా బైక్‌పై విచారణకు వెళ్లి తిరిగి పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న ఓ హెడ్‌కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలం దర్వేశిపురం స్టేజీ సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గుల పల్లి మండలంలోని ఆగమోత్కూర్ గ్రామానికి చెందిన బొల్లెపల్లి సైదులుగౌడ్(47) నల్లగొండలో నివాసముంటూ కనగల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం విచారణ నిమిత్తం ద్విచక్ర వాహనంపై జీచెన్నారం గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో దర్వేశిపురం స్టేజీకి కొద్దిదూరంలో నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సైదులుగౌడ్‌ను 108వాహనంలో నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ పరిస్థితి విషయమించడంతో మృతిచెందారు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి సందర్శించారు. హెడ్‌కానిస్టేబుల్ సైదులుగౌడ్ మృతితో కనగల్ పోలీస్‌స్టేషన్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

### రోడ్డు దాటుతుండగా...

భువనగిరి రూరల్: మోపెడ్ వాహనంపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని అతివేగంగా వస్తున్న టిప్పర్ వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు చెందిన కీర్తి వెంకటేశ్వర్లు(60) పని నిమిత్తం మోపెడ్‌పై మండలంలోని వడాయిగూడెం గ్రామం వద్ద రోడ్డు దాటుతుండగా యాదగిరిగుట్ట నుంచి రాయిగిరి వైపు అతివేగంగా వస్తున్న టిప్పర్ వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేశ్వర్లు భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు.

### గుర్తుతెలియని వాహనం ఢీకొని...



కడారి శ్రీను (ఫైల్)

నాగారం: సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని నాగారం బంగ్లా గ్రామపంచాయతీ పరిధిలోని విజయనగర్ వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. పసునురు గ్రామానికి చెందిన కడారి శ్రీను(50) డి.కొత్తపల్లిలో శనివారం జరిగిన గంగదేవమ్మ గుడి పండుగకు తమ సమీప బంధువు ఇంటికి వెళ్లాడు. సోమవారం రాత్రి హైదరాబాద్‌కు వెళ్లడానికి కొత్తపల్లి నుంచి నాగారం వైపు నడుచుకుంటూ వస్తుండగా విజయనగర్ సమీపంలో జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీను హైదరబాద్ హయత్‌నగర్‌లో ఐదేళ్ల నుంచి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. శ్రీనుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడి సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎం. ఐలయ్య తెలిపారు.

### ఆటో ఢీకొని వృద్ధుడు మృతి..

మోత్కూరు: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలం కంచనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కమ్మగూడెం గ్రామానికి చెందిన తిప్పబత్తిని రాజయ్య(73) రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళుతున్నాడు. ఆ సమయంలో మోత్కూరు నుంచి చిన్నపడిశాల గ్రామానికి వెళుతున్న ఆటోను డ్రైవర్ బండారి వెంకటేష్ అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో పాటిమట్ల గ్రామం వద్ద పల్లీకొట్టి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న రాజయ్యపై పడింది. తీవ్రంగా గాయపడిన రాజయ్యను చికిత్సనిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. రాజయ్య కుమారుడు విజయభాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### గేదెను ఢీకొని యువకుడు



మచ్చ సందీప్ (ఫైల్)

గరిడేపల్లి: బైక్‌పై వెళ్తున్న యువకుడు గేదెను ఢీకొని మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి గరిడేపల్లి మండలంలో జరిగింది. ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కోదండరాంపురం గ్రామానికి చెందిన మచ్చ సందీప్(31) బైక్‌పై సోమవారం తన స్నేహితుడితో కలిసి మఠంపల్లి మండలం పెదవీడు గ్రామం వెళ్లి అతనిని అక్కడ దించి కోదండరాంపురం బైక్‌పై తిరిగి వస్తుండగా రాత్రి 10.30 గంటల సమయంలో కోదా డ, మిర్యాలగూడ ప్రధాన రహదారిపై మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామ శివారులో శ్రీవిజయ రైస్‌మిల్లు వద్ద అకస్మాత్తుగా పొలంలో నుంచి గేదె రోడ్డుపైకి రావడంతో బైక్‌పై ఉన్న సందీప్ గేదెను బలంగా ఢీకొట్టి రోడ్డుపై పడడంతో తలకు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. సందీప్ తండ్రి సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# కుటుంబానికి అండగా సాగుతూ

▸▸ కూరగాయల సేద్యంలో రాణిస్తున్న అర్వపల్లి మహిళలు ▸▸ కాలానికి అనుగుణంగా పంటలు ▸▸ 40 కుటుంబాల మహిళల సాగుబాట

**కూరగాయలు, ఆకుకూరల సాగును జీవనోపాధిగా మలుచుకున్నారు సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి గ్రామానికి 40 కుటుంబాల మహిళలు. 50 ఏళ్లుగా వారు కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తూ వచ్చిన ఆదాయంతో కుటుంబాలకు అండగా ఉంటున్నారు. కుటుంబ పోషణ, పిల్లల చదువు, అమ్మాయిల పెళ్లిళ్ల కోసం ఆసరాగా ఉంటున్నారు. వ్యవసాయ క్షేత్రాల వద్ద ఉన్న కొద్దిపాటి భూముల్లో స్వయంగా కూరగాయలు, ఆకుకూరలు సేద్యం ఆదర్శంగా నిలుస్తున్నారు.**

**- (ఆంధ్రజ్యోతి అర్వపల్లి)**



అర్వపల్లిలో పాలకూర, చుక్కకూర తోటలను సేద్యం చేస్తున్న మహిళలు

కాలానికి అనుగుణంగా వ్యవసాయ భూముల్లో సేంద్రియ ఎరువులతో ఆకుకూరలు, కూరగాయలతోపాటు రకరకాల పంటలు పండిస్తున్నారు. టమాట, బెండకాయ, గోకరకాయ, సోరకాయలు, దోసకాయ, మునగకాయలు, వంకాయలు, పచ్చిమిర్చి, బీరకాయలతో పాటు ఆకుకూరలైన పాలకూర, తోటకూర, చుక్కకూర, గంగబాయిలీకూర, బచ్చలికూర, కోతిమీర, పుదీనా, మెంతుకూర, గోంగూర పంటలను ఎకరం, అర ఎకరం స్థలంలోనే సేద్యం చేస్తున్నారు. చిన్న చిన్న మడులు చేసి పంటలు పండిస్తున్నారు. ఉదయం ఐదు గంటలకే కూరగాయలు, ఆకుకూరల తోటలకు వెళ్లి పంట పనుల్లో నిమగ్నమవుతారు.

### తాజా కూరగాయలతో గిరాకీ

కూరగాయలు, ఆకుకూరలు తాజాగా ఉండడంతో గిరాకీ ఉంటుంది. లాభసాటిగా పండిస్తూ ఆదాయం పొందుతున్నారు. ఇతర జిల్లాలో ఉన్న సంతలో విక్రయించడానికి మహిళలు ఆటోల్లో వెళ్లి విక్రయిస్తారు. జనగాం జిల్లా దేవరప్పుల,జిల్లాలో తిరుమలగిరి, అ ర్వపల్లి,నూతనకల్,మద్దిరాల, ఫణిగిరి, నెమ్మికల్, శా లిగౌరారం, తుంగతుర్తి గ్రామాల సంతల్లో తమ పంటలను విక్రయిస్తారు.



కూరగాయలు అమ్ముతున్న మహిళ



### కుటుంబాలను పోషించుకుంటున్నాం

ఏళ్ల తరబడి నుంచి కూరగాయలు,ఆకుకూరలు పండించుకుంటూ కుటుంబాలను పో షించుకుంటున్నాం. ఈ పంటలతో పిల్లల చదువుల ఖర్చులకుఆసరాగా ఉంటున్నాయి. జిల్లా దాటి సంతల్లో ఆకుకూరలు విక్రయిస్తాం. కూరగాయలు తాజాగా ఉండడంతో గిరాకీ ఉంటుంది.

- మేకల రజిత, మహిళా రైతు అర్వపల్లి.

### ఆకుకూరలనే నమ్ముకున్నా



మాకు ఉన్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో కూరగాయలు, ఆకు కూరలు సేద్యం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. ఉదయం నుంచి పంటల వద్దకు వెళ్లి సేద్యం చేస్తున్నాం. తాజా కూరగాయలు, ఆకుకూరలు పండించడంతో మార్కెట్, సంతల్లో కూరగాయలకు గిరాకీ ఉంది. కూరగాయలను అమ్ముకొని కుటుంబాలను పోషించుకుంటున్నాం.

- కనుకు పద్మ, మహిళా రైతు అర్వపల్లి.

### లాభసాటిగా ఉంది



ఆకుకూరలు, కూరగాయల సాగుతో మాకు లాభసాటిగానే ఉంది. మంచి ఆదాయం పొందుతున్నాం. కష్టపడి కూరగాయలు, ఆకుకూరలను సాగు చేస్తున్నాం. ప్రతి సంవత్సరం టమాట, సోరకాయ, బెండకాయ ఎక్కువగా పండిస్తాం. 50ఏళ్లుగా ఈ పంటలు సాగు చేస్తున్నాం. అర్వపల్లి సంతతో పాటు ప్రతిరోజూ 365వ జాతీయ రహదారిపై పుదీనా, కొత్తిమీర, మునగకాయలను విక్రయిస్తాం.

- కట్టెల విజయ, మహిళా రైతు అర్వపల్లి.



# ప్రైవేటు వల

» ఇంటర్ ప్రవేశాల కోసం కళాశాలలు జోరుగా ప్రచారం
» ఇంటింటికీ తిరుగుతున్న పీఆర్‌వోలు

**మా కాలేజీలో చదివితే మీ పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. జేఈఈ మెయిన్స్, ఎంసెట్‌లో మంచి ర్యాంక్ వ స్తుందంటూ ఇంటర్ ప్రైవేటు కళాశాలలు ప్రచారం హో రెత్తిస్తున్నాయి. జిల్లాలోని పలు గ్రామాల్లో కళాశాలల యాజమా న్యాలు పీఆర్వోలను ఇంటింటికీ పంపిస్తూ విద్యార్థుల తల్లి దండ్రులను సంప్రదిస్తూ ప్రవేశం పొందుతు న్నారు. వారి నుంచి రూ. లక్షల్లో ఫీజు వసూలు చేస్తున్నారు.**

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

విద్యార్థుల ప్రవేశాల కోసం ప్రచారం హోరెత్తిస్తున్నాయి. పదోతరగతి పూర్తయిన విద్యార్థుల ఇళ్లకు వచ్చి తమ కాలేజీలో చేరితే జేఈఈ మెయిన్స్, నీట్ ర్యాంకులు పక్కా వస్తాయని ఆశలు చూపి అడ్మిషన్లు తీసుకునేలా ప్రచారం సాగిస్తున్నారు. ఏడాదికి రూ.లక్షల ఫీజులు వసూలు చేస్తున్నారు. పదోతరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసమంటూ హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో చేర్పిస్తున్నారు. దీంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేరుతున్నా పిల్లల సంఖ్య ఏటా తగ్గిపోతోంది. పదోతరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు హైదరాబాద్, ఘట్‌కేసర్, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని కాలేజీల్లో చేరుతుంటే.. అంతంతే మార్కులు వచ్చిన వారు స్థానికంగా ఉన్న జూనియర్ కాలేజీల్లో చేరుతున్నారు. ఫలితంగా ఇంటర్మీడియేట్‌లో ఫలితాలు తగ్గిపోతున్నాయి. ఇంటర్ ప్రవేశాలపై ప్రభుత్వ ఆజమాయిషీ లేకపోవడంతో ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల పీఆర్వోలు పల్లెల్లోకి వచ్చి విద్యార్థుల అడ్మిషన్లు తీసుకుంటున్నారు. హైదరాబాద్‌కు అతి చేరువలో ఉన్న భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్ మున్సిపాలిటీలతోపాటు బీబీనగర్, భువనగిరి తదితర పట్టణాల్లో ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల ప్రచారం విస్తృతంగా జరుగుతున్నాయి. అడ్మిషన్ల కోసం అనేక మార్గాలు అన్వేషిస్తున్నారు. ఎలాగైనా విద్యార్థులు, తల్లిదండ్రులను ఒప్పించి తమ కాలేజీల్లో చేరాలని కోరుతూ కరపత్రాలు, వాల్‌పోస్టర్లతో ప్రచారం సాగిస్తున్నారు.

### ఆర్థిక దోపిడీకి అరికట్టేదెవరు..?

పదో తరగతి ఫలితాలు రావడంతో ఇప్పటికే కార్పొరేట్ కళాశాలల పీఆర్వోలు విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. వారిని ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నలయ్యారు. పదోతరగతి చదివి ఉత్తీర్ణులైన పాఠశాలల యాజమాన్యాలకు తాయిలాలు ఇస్తూ వారిని తమ వైపు తిప్పుకుంటున్నారు. కొన్ని కాలేజీలు విద్యార్థులకు కాలేజీలో అడ్మిషన్ చేయిస్తే ఇంత ఇస్తామని హామీ ఇస్తున్నారు. కమీషన్‌దారులు గ్రామాల్లోని తమకు తెలిసిన వారిని కాలేజీల్లో చేర్పిస్తున్నారు. కొన్ని కాలేజీల వారు విద్యార్థుల నుంచి కొంత ఫీజు తీసుకుని అడ్మిషన్లు కూడా ఇచ్చేస్తున్నారు. అయితే కాలేజీలు ఆరంభం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులను తమ కళాశాలలకు ఆహ్వానిస్తున్నారు. కాలేజీ ప్రత్యేకతలు వివరిస్తున్నారు. వారి మాటలకు ఆకర్షితులైన తల్లిదండ్రులు కొందరు కొంత మొత్తం డబ్బులు చెల్లించి మరీ అడ్మిషన్లు తీసుకుంటున్నారు. బోధన విధానం, హాస్టల్‌లో ఫుడ్, ఇతర ఏ అంశంలోనైనా నచ్చక విద్యార్థి ఇంతకి తిరిగి వస్తే కాలేజీ వారు ఫీజు తిరిగి ఇవ్వరు. ఒక వేళ ఇచ్చినా ఎంతో కొంత కట్ చేసుకునే ఇస్తారు. డిగ్రీ 'దోస్త్' తరహాలో ఇంటర్‌లోనూ 'ఆన్‌లైన్' ప్రవేశాలు చేపడితే ఇలాంటి ఇబ్బందులకు అవకాశం ఉండదని విద్యార్థులు, తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఆర్థిక దోపిడీని ఎవరు అరికడుతారని ప్రశ్నిస్తున్నారు.

### అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి



ఈ విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. బోర్డు అధికారులు జారీ చేసిన నోటిఫికేషన్ల బట్టి ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటికైతే డిగ్రీ తరహా 'దోస్త్' ఆన్‌లైన్ విధానం లేదు. ఎప్పటిలాగే పాత పద్ధతిలోనే కాలేజీల వారీగా అడ్మిషన్లు జరుగుతున్నాయి. జిల్లాలోని 10 ప్రభుత్వ, 32 ప్రభుత్వ అనుబంధ, 20ప్రైవేటు కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది.

– రమణి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి యాదాద్రి

### పాత విధానమే..

ఈ విద్యాసంవత్సరం ఇంటర్మీడియట్‌లో విద్యార్థుల ప్రవేశాల కోసం పాత విధానాన్నే అమలు చేయనున్నారు. తొలుత డిగ్రీ ప్రవేశం మాదిరి 'దోస్త్' తరహా ఆన్‌లైన్ విధానం అమలు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు భావించింది. కానీ, ప్రస్తుతం అమలుకు వీలు కాదని బోర్డు అధికారులు తేల్చి చెప్పారు. దీంతో పాతవిధానం అమలుకు నిర్ణయించారు. ఫలి తంగా ప్రైవేటు కళాశాలలు, కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు పదో తరగతి విద్యార్థుల ఇళ్ల వద్దకు వచ్చి అడ్మిషన్లు చేయించుకుంటున్నారు. యాదాద్రి-భువనగిరి జిల్లాలో 10 ప్రభుత్వ 32 ప్రభుత్వ అనుబంధ, 20 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. ఆయా కాలేజీల్లో ఏటా ప్రవేశాల స ం ఖ్య తగ్గిపోతూనే ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### 'ప్రైవేట్' ఒత్తిడికి చెక్ పడేదెప్పుడో...?

ఇంటర్ ప్రవేశాల్లో 'దోస్త్' తరహాలో ఆన్‌లైన్ విధానం అమలైతే విద్యార్థులపై ఒత్తిడి తగ్గి మేలు కలిగే అవకా శం ఉంటుంది. విద్యార్థులు తమకు నచ్చిన కాలేజీ ను ప్రాధాన్యతా క్రమంలో ఎంపిక చేసుకునే వీలుంటుంది. పదో తరగతిలో వచ్చి న మా ర్కులు, రిజర్వేషన్లు ఆధారంగా ఇంటర్ లో సీట్ల కేటాయింపులు జరిగితే విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలలో చదివే అవకాశం లభిస్తుంది. విద్యార్థులపై ఒత్తిడికి చెక్ పెట్టాల్సిందిగా తల్లిదండ్రులు కోరుతున్నారు.

### సాగర్ సమాచారం

| | |
|---|---|
| పూర్తిస్థాయి నీటి మట్టం | 590.00 అడుగులు |
| టీఎంసీలు | 312.0450 |
| ప్రస్తుత నీటి మట్టం | 512 అడుగులు |
| టీఎంసీలు | 135.0900 |
| ఎడమకాల్వకు నీటి విడుదల | నిల్ |
| కుడికాల్వకు | 4,050 |
| విద్యుత్ కేంద్రం ద్వారా | నిల్ |
| క్రస్ట్ గేట్ల ద్వారా | నిల్ |
| ఎస్ఎల్‌బీసీ ద్వారా | 450 క్యూసెక్కులు |
| వరద కాల్వ ద్వారా | నిల్ |
| ఇన్‌ఫ్లో | నిల్ |
| అవుట్‌ఫ్లో | 4,500 క్యూసెక్కులు |
| ఎన్ని గేట్ల ద్వారా | నిల్ |

### పులిచింతల ప్రాజెక్టు

| | |
|---|---|
| పూర్తిస్థాయి నీటి నిల్వ | 45.77 టీఎంసీలు |
| ప్రస్తుత నీటి నిల్వ | 25.10 టీఎంసీలు |
| పులిచింతలకు నీటి రాక | నిల్ |
| అవుట్‌ఫ్లో | 300 క్యూసెక్కులు |
| ఎన్ని గేట్ల ద్వారా | నిల్ |

### మూసీ నీటిమట్టం

| | |
|---|---|
| పూర్తిస్థాయి నీటి మట్టం | 645 అడుగులు |
| టీఎంసీలు | 4.46 |
| ప్రస్తుత నీటి మట్టం | 634.80 అడుగులు |
| టీఎంసీలు | 3.21 |
| ఎన్ని గేట్ల ద్వారా | నిల్ |
| ఇన్‌ఫ్లో | 347. 68క్యూసెక్కులు |
| అవుట్‌ఫ్లో | 87.88 క్యూసెక్కులు |

## ఎల్లమ్మ జాతరకు వేళాయె

● రేపటి నుంచి ఈ నెల 7వ తేదీ వరకు దర్వేశిపురం ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయం

(ఆంధ్రజ్యోతి - కనగల్)

నల్లగొండ జిల్లా కనగల్ మండలం దర్వేశిపురం(పర్వతగిరి) స్టేజీ వద్ద స్వయంభువుగా వెలసిన రేణుకా ఎల్లమ్మ ఆలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి 7 వరకు వైభవంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయానికి వివిధ రంగులు వేసి విద్యుదీపాలతో అలకరిస్తున్నారు కల్యాణ మండపం చుట్టూ భ క్తుల సౌకర్యార్థం చలువ పందిళ్ల వేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తుంది.

**పూజలు ఇలా..**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 5న గురువారం ఉదయం మంగళవాయిద్యాలతో సుప్రభాతసేవ, లలిత సహస్రనామార్చన, బాలభోగ నివేదన, ధ్వజారోహణం, దేవి మూలమంత్ర హోమాలు, మండప పూజలు, నీరజానమంత్ర పుష్పములు, మహానివేదన, గవ్యాంత పూజలు, వాస్తుపూజ నిత్యహోమాలు, విష్వేశ్వరపూజలు, స్వస్తివాచనం, పంచగవ్యప్రాసవ, రక్షాబంధనం, అఖండ దీపారాధన ఋత్విక్‌దీక్షాధారణ, త్రిశూలపూజ మధ్యాహ్నం చండీహోమం, ఎదుర్కోళ్ల మహోత్సవం, 6న మంగళవాయిద్యాలతో సుప్రభాత సేవ, లలిత సహస్రనామార్చన, బాలభోగ నివేదన ఉదయం 10:30 గం. అమ్మవారి తిరుకల్యాణ మహోత్సవం, 7న ఉదయం గవ్యాంత పూజలు, 108 కలశంతో అష్టోత్తర శతఘటాభిషేక మహోత్సవం, మృత్యోపాసన బలిహరణ, త్రిశూల స్నానం, సాయంత్రం 4 గంటలకు దర్వేశిపురం, పర్వతగిరి గ్రామస్తులతో బోనాలు రాత్రి ఏకాంత సేవ, నీరజాన మంత్రపుష్ప కార్యక్రమాలు జరుగనున్నవి. కల్యాణ మహోత్సవానికి రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా రాష్ట్ర ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరు కానున్నారు. కాగా జాతర హాజరై భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు, ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆలయం వద్ద తాగునీటి వసతి, పారిశుధ్య పనులు జరుగుతున్నట్లు కల్యాణం రోజు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసుల సహకారం తీసుకుంటున్నట్లు ఆలయ ఈవో జయరామయ్య చెప్పారు.

## ఆంజనేయుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్ర పాల కుడు అంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద అంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి ముఖమండపంలోని స్ఫటికమూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్ర హావనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో అంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 31,13,574 ఆదాయం సమ కూరినట్లు ఈవో వెంకట్రావ్ తెలిపారు.



క్షేత్రపాలకుడికి హారతి ఇస్తున్న అర్చకుడు

## గ్రామగ్రామాన నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం



విత్తన సంచులు అందజేస్తున్న సూర్యాపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామారావు

కోదాడ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామగ్రామాన నాణ్యమైన విత్తనాలు అందించేందుకు రైతన్నకు నేస్తం దోహదపడుతుందని సూర్యాపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత సంధ్యారాణిలు అన్నారు. మంగళవారం కోదాడ మండలంలోని కాపుగల్లు రైతువేదికలో ఎంపిక చేసిన రైతులకు విత్తన సంచులను వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాపుగల్లు సహకార సంఘ చైర్మన్ నంబూరి సూర్యం, ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయాధికారి పాలెం రజని, ఏఈఓలు ఝాన్సీ, సల్మా, మహేష్, నగేష్, రైతులు జాబిశెట్టి నాగప్రసాద్, బొల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శివన్నగూడెం నుంచి లిఫ్ట్ నీటిని తరలిస్తాం

● మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకం దిగువన ఉన్న ఎదుల్ల మీదుగా శివన్నగూడెం రిజర్వాయర్‌కు నీటిని తీసుకొచ్చి సంస్థాన్‌నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు లిఫ్ట్‌ద్వారా నీటిని తరలిస్తామని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడు రైతు వేదికలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో యువరైతులకు పంటల సాగుపై నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కష్టాన్ని నమ్ముకొని ఆరుగాలం శ్రమిస్తూ వ్యవసాయం చేస్తున్న రైతులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ రంగంలో ప్రధాన వనరుగా అవసరపడే నీటిని ఈ ప్రాంతానికి తీసుకొచ్చే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. కురిసిన వర్షం నీటిని వృథాగా పోనియకుండా ప్రతీ చుక్కనూ ఒడిసి పట్టడానికి ప్రత్యేక కార్యాచరణతో ప్ర ణాళికలను రూపొందించామన్నారు. అందులో తొలిదశగా 148 చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఉద్యానవన శాఖ జిల్లా అధికారి అనంతరెడ్డి మాట్లాడుతూ రైతులు పంటల సాగులో అనువైన సమయం పాటించటం కీలకమన్నారు. పంటల సాగులో ఆధునిక పద్ధతులను పాటిస్తూ తమ శాఖ అధికారుల సలహాలు, సూచనలతో అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ నియోజకవర్గ అధికారి విద్యాసాగర్, ఏవో పద్మజ పాల్గొన్నారు.



మునుగోడులో నిర్వహించిన శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

● మునుగోడులోని సర్వే నెంబరు 78లో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మించేందుకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు పాఠశాల నిర్మాణం కోసం పలువురు రైతులు తమ పట్టా భూములను విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. మునుగోడు చెందిన మేడి ముత్తయ్య రైతు తనకున్న మూడు ఎకరాల అసైన్డ్ పట్టా భూమిని పాఠశాల నిర్మాణానికి అందజేశారు. దీంతో ముత్తయ్యను ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మంగళవారం క్యాంపు కార్యాలయానికి పిలిపించి శాలువాతో ప్రత్యేకంగా సన్మానించారు.

## 640అడుగులకు మూసీ ప్రాజెక్టు నీటిమట్టం



వరద నీటితో కళకళలాడుతున్న మూసీ రిజర్వాయర్

కేతేపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద నీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతోంది. ఎగువన గల హైదరాబాద్ నగరంతో పాటు మేడ్చల్, మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, యాదాద్రిభువనగిరి, జనగాం తదితర జిల్లాలకు చెందిన పలు ప్రాంతాల్లోని వాగులు, వంకల నుంచి క్రమం తప్పకుండా వరద నీరు వచ్చి ప్రాజెక్టులో చేరుతుంది. దీంతో వానాకాలం ప్రారంభంలోనే ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టానికి చేరువలోకి వచ్చింది. ఎగువ నుంచి నిరంతరం వస్తున్న వరద నీటితో 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 640 అడుగుల (3.21టీఎంసీలు)కు చేరింది. ఎగువ నుంచి 347 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరడానికి మరో ఐదు అడుగుల మేర నీరు చేరాల్సి ఉంది.

## గ్లోబల్ యూత్ సమ్మిట్ 25కు
## ఎంజీయూ విద్యార్థినుల ఎంపిక

నల్లగొండ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వం, మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎంపవర్‌మెంట్ అండ్ స్పోర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 5,6 తేదీల్లో కర్ణాటకలోని మంగళూరులోని యానేపోఈ డీమ్డ్ యూనివర్సిటీలో గ్లోబల్ యూత్ సమ్మిట్ 2025ను నిర్వహిస్తున్నారు. ఈ సమ్మిట్‌కు మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్లు ఎంపికయ్యారు. టీటీ డబ్ల్యూఆర్‌డీసీ సూర్యాపేట, టీజీ డబ్ల్యూఆర్ఎఫ్‌డీసీ భువనగిరి కళాశాలలకు చెందిన విద్యార్థినులు మనీషా, సిరివెన్నెల ఎంపికైనట్లు విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ పసుపుల మద్దిలేటి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను మంగళవారం ఎంజీయూ వీసీ ఖాజాఅల్తాఫ్‌హుస్సేన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో టీటీడబ్ల్యూఆర్‌డీసీ ప్రిన్సిపాల్ సునీల తదితరులు పాల్గొన్నారు.



ఎంపిక పత్రం చూపుతున్న వీసీ అల్తాఫ్ హుస్సేన్

## హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ

నకిరేకల్, జూన్3 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ చా టారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామంలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ బాల బాలికల ఛాంపియన్‌షిప్ పోటీల్లో నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలోని ఏపీఎం పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థినులు నామ నిఖిత, రమావత్ సిద్ధు ప్రతిభ కనబరిచినట్లు మంగళపల్లి హైస్కూల్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నిమ్మల శంకర్‌గౌడ్ తెలిపారు. ఇటీవల మంగళపల్లి హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా జూనియర్ బాల, బాలికల జిల్లా జట్టులో వారు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంగళవారం ఏపీఎం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమలో కళాశాల ప్రిన్సిపాల్ కందాళ స్వప్నశ్రీకాంత్‌రెడ్డి, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.



విద్యార్థులను సన్మానిస్తున్న ఏపీఎం కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న శ్రీకాంత్‌రెడ్డి

## మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

హుజూర్‌నగర్ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ముల్కలపల్లి రాంబాబు కోరారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగరన్ పట్టణంలోని ఇందిర సెంటరులో మలిదశ ఉద్యమకారులు చిలకరాజు అజయ్‌కుమార్, దొడ్డా నర్సింహారావు, తోట యలమందయ్య, పచ్చిపాల ఉపేందర్‌యాదవ్, మహేష్‌రాథోడ్‌లను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రతినెల రూ.20వేల పింఛన్, 250 గజాల స్థలం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాము, సాయి, నాగరాజు, వెంకి, చాంద్, రఫి, శ్రీను, భాస్కర్‌రెడ్డి, యలమంద పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కేతేపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారజాతా మంగళవారం కేతేపల్లి మండలం వివిధ గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా మండలంలోని ఇనుపాముల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలు, డిజిటల్ తరగతులు, లైబ్రరీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధతో నిపుణులైన ఉపాధ్యాయులతో ఒత్తిడి లేని చదువు అందుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిత్తలూరి సత్యనారాయణ, పి.రమేష్, జయసాగర్, బి.శ్యామయ్య, రవికుమార్, కిషోర్, హరికృష్ణ, వేణుగోపాల్, కె.శ్రీనివాస్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



ఇనుపాములలో నిర్వహించిన యూటీఎఫ్ ప్రచార జాతాలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

## బీజేపీ మండల అధ్యక్షుడిగా వినోద్‌కుమార్



శాలిగౌరారం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండల బీజేపీ నూతన కార్యవర్గాన్ని నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మండల అధ్యక్షుడిగా తోట వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు శ్యాంసుందర్‌రెడ్డి, బాషబోయిన వెంకన్న, కోశాధికారి బండారు లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు బోడ రాజు, యాదగిరి, పాండురంగయ్య, గణేష్ సభ్యులను నియమించారు.

## జిల్లా కేంద్రంలో ఉచిత ధ్యాన శిబిరం

నల్లగొండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సెలక్టివ్ థికింగ్ మైండ్ మెడిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఉచిత ధ్యాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు రైల్వేస్టేషన్ రోడ్డులో, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు వీటీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 7981825495 కు సంప్రదించాలని కోరారు.

## నిందితులను అరెస్ట్ చేయాలి

శాలిగౌరారం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవునిబండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పులిచర్ల వెంకన్న, శంకరయ్యలపై అదే గ్రామానికి చెందిన కొంతమంది హత్యాయత్నం చేయడం అమానుషమని, నిందితులను అరెస్ట్ చేసిన కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ డిమాండ్ చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడి నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకన్న, శంకరయ్యలను ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో కూడా వీరిపై దాడి చేస్తే నాలుగు కేసులు నమోదయ్యాయని, ఇలాంటి ఘటన పునరావృతం కావడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గూని వెంకటయ్య, మాజీ సర్పంచులు దండ రేణుక అశోక్‌రెడ్డి, అల్లి సైదులు, నరిగె శంభయ్య, జిల్లా నాయకులు పెరుమాండ్ల నరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోడ దానయ్య, కడారి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## వృథాగా పోతున్న నీరు



ప్రధాన రహదారిపై వృథాగా పారుతున్న మిషన్ భగీరథ నీరు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన మిషన్‌భగీరథ పైపులైను పగిలి తాగునీరు వృథాగా పోతుంది. చండూరు మునిసిపాలిటీ పరిధిలోని 4 వ వార్డులో శివాజీనగర్‌తో పాటు పలు కాలనీల్లో మిషన్‌భగీరథ పైపులైను ధ్వంసమైంది. దీంతో ప్రధాన రహదారిపై నీరు ఏరులై పారుతోంది. దీంతో వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు తప్పడం లేదు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మిషన్ భగీరథ ఏఈ సాయిచరణ్ వివరణ కోరగా గతంలో వాటర్ సప్లై కోసం పైపులైను వేశామని, వాటిపై సీసీ రోడ్డు వేయడం కారణంగా ఒత్తిడి గురై పైపులు పగిలినట్లు గుర్తించామని వెల్లడించారు. చండూరు మునిసిపాలిటీ కావడంతో పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమన్వ యం చేసుకుని సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

● చండూరు

## నకిరేకల్‌లో డ్రైనేజీలు లేక అవస్థలు



నకిరేకల్ మెయిన్ సెంటర్‌లోని ఎస్టీవో కార్యాలయం వద్ద నిర్మిస్తున్న డ్రైనేజీ

భారీ వర్షాలు కురిసినప్పుడు నకిరేకల్ మునిసిపాలి టీ పరిధిలో కొన్ని వార్డులు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. డ్రైనేజీ పూర్తిస్థాయిలో ని ర్మాణం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మునిసిపల్ పరిధిలో 20 వార్డులు ఉన్నా కొన్ని వార్డుల్లో మాత్రం డ్రైనేజీ సమస్యతో ఆ కాలనీవాసులు వర్షాలు వచ్చినప్పుడు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కొన్ని వార్డుల్లో డ్రైనేజీ పూర్తిస్థాయిలో ఉన్నా మరికొన్ని వార్డుల్లో అధ్వానంగా ఉన్న డ్రైనేజీ కారణంగా ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా నకిరేకల్ మెయిన్ సెంటర్‌లోని ఎస్టీవో కార్యాలయం, కోర్టు ప్రాంతంలో వర్షాలు వచ్చినప్పుడు మురుగునీరు ఎక్కువగా నిలిచి ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వీరేశం సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.1.70కోట్లు మంజూరు చేయించారు. డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేయడంతో పనులు కొనసాగుతున్నాయి. ఇవి పూర్తయితే కొంత సమస్య పరిష్కారం కానుంది.

● నకిరేకల్

## రహదారి ఆక్రమించి...



జడ్పీ హైస్కూల్ పక్కన ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలు

చండూరులో ప్రణాళికా విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొందరు వ్యాపారులు యథేచ్ఛగా రహదారులను ఆక్రమించి దుకాణాలు నిర్మిస్తున్నారు. గుండ్రాపల్లి ఎక్స్‌రోడ్డు, జడ్పీహైస్కూల్ ప్రహరీని ఆనుకుని ప్రధాన రహదారి వెంబడి కొందరు, హైదరాబాద్ రోడ్డులో, తెలంగాణ తల్లి విగ్రహం పక్కన కొంతమంది వ్యాపారులు సిమెంట్ కట్టడాలు, రేకులతో షెడ్డులను వేసుకుని స్థలాలను ఆక్రమించుకున్నా మునిసిపల్ అధికారులు అడ్డుకోలేకపోతున్నారు. వారికి కొందరు మాజీ ప్రజాప్రతినిధులు అండగా ఉన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో వాహనాలకు అసౌకర్యంగా మారుతుంది. ఈ విషయంపై కమిషనర్ పుష్పలతను వివరణ కోరగా తాము నిర్మాణాలకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. ప్రణాళిక సిబ్బందిని పంపి పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

● చండూరు

# భూ సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు



శాలిగౌరారం: తుడిమిడిలో తహసీల్దార్‌కు దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

శాలిగౌరారం, చిట్యాలరూరల్, మర్రిగూడ, గట్టుప్పల్, కనగల్, కేతేపల్లి, కట్టంగూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): భూముల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. మంగళవారం జిల్లాలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులను ప్రారంభించారు. గ్రామాల్లో ఎలాంటి భూ సమస్యలు ఉన్నా వాటి పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం సదస్సులను నిర్వహిస్తుందని అన్నారు. దీర్ఘకాలంగా ఉన్నటువంటి భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కొంతమంది రైతులు సాదాబైనామాల కింద కొనుగోలు చేసిన వాటికి పట్టాలు ఇవ్వాలని, కబ్జాలో ఉన్న భూములకు, అదేవిధంగా ప్రభుత్వ భూములను కొనుగోలు చేసిన వాటికి పట్టాలు అందజేయాలని, భూమి స్వభావాన్ని సరిచేసి రైతులకు భూభారతి ద్వారా పట్టాలు అందజేయాలని రైతులు అధికారులను కోరారు.

● శాలిగౌరారం మండలంలోని తుడిమిడి, ఉప్పలంచ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. తుడిమిడిలో తహసీల్దార్ యాదగిరి అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పలువురు రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఉప్పలంచలో 62, తుడిమిడిలో 34 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్‌చైర్మన్ నరిగే నర్సింహ, ఆర్ఐలు మహ్మద్ అజారుద్దీన్, మహ్మద్ అబ్దుల్ రఫీ, సీనియర్ అసిస్టెంట్ బి.ప్రవీణ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని వట్టిమర్తి, పెద్దకాపర్తి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో చిట్యాల మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ నర్రా వినోద పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం గ్రామాల్లో నెలకొన్న భూముల సమస్యల పరిష్కారం భూభారతి చట్టాన్ని అమలు చేస్తుందని అన్నారు. సదస్సుల్లో చిట్యాల పీఏసీఎస్ డైరెక్టర్ నర్రా మోహన్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, పర్వేయర్ రజనీకాంత్, ఆర్ఐలు అమర్‌నాథ్‌రెడ్డి, జానీ షరీఫ్, సీనియర్ అసిస్టెంట్ శశిధర్, జూనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది కృష్ణవేణి, దయాకర్, రమేష్, హరిప్రీత్‌రెడ్డి, విజయ్, ఫరీద్, నదీమ్ పాల్గొన్నారు.

● మర్రిగూడ మండలంలోని సరంపేట, బట్లపల్లి గ్రామాలలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ భూభారతి నిబంధన ప్రకారమే విచారణ జరిపి బాధిత రైతులకు పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకొని రశీదులు పొందాలని సూచించారు. ఈ రెవెన్యూ సదస్సులను బాధిత రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెండు గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 166 దరఖాస్తులు రైతులు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● గట్టుప్పల్ మండలంలో ఈనెల 10వ తేదీ వరకు నిర్వహించే భూభారతి రెవెన్యూ సదస్సులు రైతులు, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాములు అన్నారు. అంతంపేట గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పలువురు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భూమికి సంబంధించిన పూర్తి వివరాలతో సదస్సు వద్దకు రావాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ సుకన్య, ఆర్ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



చిట్యాల: పెద్దకాపర్తిలో రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ కృష్ణ



మర్రిగూడ: సరంపేట రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

● కనగల్‌లో రెవిన్యూ సదస్సులకు రైతుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. మండలంలోని బొమ్మెపల్లి, శాబ్దులాపురం గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సులకు రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వివిధ రకాల భూసమస్యల పరిష్కారం కోరుతూ 53 దరఖాస్తులు రైతులు అందజేసినట్లు తహసీల్దార్ పద్మ, డీటీ పార్వతమ్మ తెలిపారు.

● కేతేపల్లి మండలంలోని ఇప్పలగూడెం, కొప్పోలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ మహ్మద్ అబ్దుల్‌సత్తార్ కొప్పోలు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పలగూడెంలో 41, కొప్పోలులో 50మంది రైతులు అధికారులకు దరఖాస్తులు అందజేశారు. ఆయా సదస్సుల్లో ఎంఆర్ఐ ఎన్.వెంకన్న, ఏఆర్ఐ రామచంద్రయ్య, ఎస్ఏ అర్జున్‌భగవాన్, సర్వేయర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● కట్టంగూరు మండలంలోని మల్లారం, తిమ్మాపురం (పరడ) గ్రామాల్లో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తిమ్మాపూర్- గ్రామంలో 21 దరఖాస్తులు, మల్లారంలో 9 దరఖాస్తులు స్వీకరించినట్లు డీటీ ఫ్రాంక్లిన్ ఆల్‌బర్ట్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ప్రియదర్శిని, శ్రీనివాస్, ఊర్మిళ, రవి, బాలరాజు, భాగ్యలక్ష్మి, రఘు, సంతోష, స్వామి, అరవింద్ పాల్గొన్నారు.

# పంట మార్పిడితోనే అధిక దిగుబడులు

నకిరేకల్, మర్రిగూడ, చండూరురూరల్, కనగల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పంట మార్పిడితోనే అధిక దిగుబడులు పొందవచ్చని, చిరుధాన్యాల పంటలను సాగు చేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే ఎమ్మెల్యే వేముల వీరేశం, శాస్త్రవేత్తలు వ్యవసాయశాఖ అధికారులు అన్నారు. జిల్లాలోని పలు మండలాల్లోని రైతు వేదికలో మంగళవారం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన నాణ్యమైన విత్తనం రైతన్న నేస్తం అనే కార్యక్రమానికి వారు హాజరయ్యారు. రైతులకు ఉచితంగా వరి విత్తనాల సంచులను పంపిణీ చేశారు.

● నకిరేకల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాణ్యమైన విత్తనం, రైతన్నకు నేస్తం అనే కార్యక్రమంలో భాగంగా రైతులకు ఎమ్మెల్యే వేముల వీరేశం చిరుధాన్యం విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యం పండించే రైతులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు. నాణ్యమైన విత్తనాలతోనే రైతులు అధిక దిగుబడి సాధించి లాభాలు పొందుతారన్నారు. భూసారం దెబ్బతినకుండా కంపోస్ట్ ఎరువుల విధానంతో వ్యవసాయం చేయడం ఉత్తమని, ఆయిల్‌పామ్ ద్వారా ఎక్కువ లాభాలు ఉన్నందున రైతులు ఆయిల్‌పామ్ చెట్లను అధికంగా సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఎసిరెడ్డి దయాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, మునిసిపల్ చైర్ పర్సన్ చెవుగోని రజితశ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, నాయకులు భిక్షం రెడ్డి, రఘుమారెడ్డి, ఇన్‌చార్జి ఏడీఏ జానిమియా, మునిసిపల్ కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● కనగల్ రైతు వేదికలో నిర్వహించిన జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సునీతాదేవి మాట్లాడారు. రైతులు నాణ్యమైన విత్తనాలను సాగు చేసి అధిక దిగుబడులను సాధించాలని కోరారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో ఎంపిక చేసిన ముగ్గురు నుంచి ఐదుగురు రైతులకు నాణ్యత గల వరి, పెసర విత్తనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఏవో అమరేందర్‌గౌడ్, ఏఈవోలు అభిలాష్‌రెడ్డి, నవీన్‌తదితరులు పాల్గొన్నారు.

● మర్రిగూడ మండలకేంద్రంలోని రైతు వేదికలో మునుగోడు ఏడీఏ బి.వేణుగోపాల్ మాట్లాడుతూ పంట మార్పిడితోనే అధిక దిగుబడులు పొందవచ్చని అన్నారు. రైతులకు ఉచితంగా వరి విత్తనాల సంచులను పంపిణీ చేశారు. పంట మార్పిడి చేస్తే మంచి దిగుబడులు పొందుతూ భూసారాన్ని పెంచుకోవచ్చని అన్నారు. రైతులు తమ విత్తనాలను తాను ఉత్పత్తి చేసుకునేలా వ్యవసాయ విశ్వవిద్యాలయాలు కృషి చేస్తున్నాయని విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు జి.సురేష్, జయశంకర్ అన్నారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ శ్రీనివాస్. ఏవో సహస్, ఏఈవోలు విజయ్, సుజాత, స్వాతి అరుణ, రాధిక, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

● చండూరు మండల పరిధిలోని బంగారిగడ్డ రైతువేదికలో ఏవో ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోలు వెంకట్‌రెడ్డి మాట్లాడారు. రైతులకు నాణ్యమైన, మేలైన విత్తనాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పునరుత్పత్తి విత్తనాలను మండలంలోని ప్రతి రెవెన్యూ గ్రామానికి ముగ్గురు రైతుల చొప్పున పంపిణీ చేసినట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు, పురుగుమందులు అమ్మకుండా నిరోధించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, నాయకులు సుజావుద్దీన్, పల్లె వెంకన్న, మార్కెట్ డైరెక్టర్లు భూతరాజు అంజనేయులు, రామలింగయ్య, బిక్షం, లింగయ్య, వెంకట్, దామోదర్‌రెడ్డి, రాజు, ఏఈవోలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



నకిరేకల్‌లో చిరుధాన్యం విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం



కనగల్‌లో విత్తనాలు అందజేస్తున్న ప్రొఫెసర్ సునీతాదేవి, అధికారులు

## నర్సరీ సిబ్బందికి ఘన సన్మానం



వన నర్సరీ సిబ్బంది ఉపేందర్, పద్మలను సన్మానిస్తున్న అధికారులు

శాలిగౌరారం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామ వననర్సరీలో మొక్కల పెంపకంలో 100 శాతం లక్ష్యాన్ని సాధించారు. ఈ మేరకు పెర్కకొండారం గ్రామపంచాయతీ వన సేవకురాలు పద్మ, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ పెరుమాండ్ల ఉపేందర్‌లను ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో కూడా నర్సరీల పెంపకంపై శ్రద్ధ వహించి నూటికి నూరుశాతం లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.యాదగిరి, ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఎంపీవో వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరిగే నర్సింహ, సింగిల్‌విండో చైర్మన్ తాళ్లూరి మురళి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, పార్టీ మండల అధ్యక్షుడు సమరంరెడ్డి, ఏపీవో జంగమ్మ, ఈసీ వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

## పండగలు, జాతరలు సంస్కృతికి ప్రతీకలు



కొప్పోలులో గంగాభవానీ ఆలయం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కేతేపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించే పండుగలు, జాతరలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కేతేపల్లి మండలంలోని కొప్పోలు గ్రామంలో సోమవారం యాదవుల ఆరాధ్యదైవం గంగాభవాని పండగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు అందంగా అలంకరించిన కుండల్లో వండిన బోనాలను అమ్మవారికి సమర్పించి తమను, తమ కుటుంబాలను చల్లగా చూడాలని కోరుకున్నారు. ఈ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ పండగలు ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని సూచించారు. ఆయా వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ ఎంపీపీ పి.శేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎం.వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు సైదులు, ప్రభాకర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

## మూడు నెలల రేషన్ ఇవ్వడం హర్షనీయం



చండూరులో పీఎం మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చండూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు లబ్ధిదారులకు మూడు నెలల కోటా ఒకేసారి ఇస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటించి అమలు చేయడం హర్షనీయమని బీజేపీ చండూరు పట్టణ అధ్యక్షుడు పందుల సత్యం అన్నారు. రేషన్ దుకాణాల వద్ద మంగళవారం ప్రధాని మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో అధికంగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ సూచన మేరకు, పేదలకు ముందస్తుగానే కేంద్రప్రభుత్వం మూడు నెలల రేషన్ సరుకులు అందిస్తుందన్నారు. 14 పంటలకు ఎంఎస్పీ కనీసం మద్దతు ధర పెంచి రైతులకు తగిన విధంగా ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కోమటి వీరేశం, సముద్రాల వెంకన్న బోడ ఆంజనేయులు, భూతరాజు శ్రీహరి, అన్నెపర్తి యాదగిరి, ఆరిగి ఆంజనేయులు, భూతరాజు స్వామి, సోమ శంకర్, చంద్రమౌళి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావును కలిసిన బీఆర్ఎస్ నాయకులు



హరీష్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

నల్లగొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి హరీష్ రావుకు జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో కలిసి ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 15లోగా 'ఫిట్‌నెస్' పరీక్ష

(5వపేజీ తరువాయి)

పాఠశాలల యాజమాన్యాలు, డ్రైవర్లతో సమావేశాలు కూడా ఏర్పాటు చేశారు. రవాణా చట్టం ప్రకారం నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు.

### ప్రైవేట్ విద్యా సంస్థలు పాటించాల్సిన నిబంధనలు

విద్యాసంస్థల పేరు, టెలిఫోన్ నెంబర్లు, మొబైల్ నెంబ ర్లు సహా పూర్తి చిరునామాను బస్సు ఎడమవైపున, ముందు భాగంలో స్పష్టంగా కన్పించేలా రాయించాలి. పాఠశాలల బస్సుల డ్రైవర్లుగా నియమించబడే వ్యక్తులకు 60 ఏళ్లకు మించి ఉండరాదు. యాజమాన్యాలు ప్రతీ బస్సు డ్రైవర్ ఆరోగ్య పట్టిక(హెల్త్‌కార్డు)ను నిర్వహించాలని, మూడు నెలలకోసారి తమ సొంత ఖర్చుపై రక్తపోటు... బీపీ, షుగర్, కంటి చూపు వంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలను ప్రతీ మూడు నెలలకోసారి చేయించాలి. రికార్డులను జాగ్రత్త పర్చాలి. డ్రైవర్లను నియమించే ముందు లైసెన్స్, ఇతర పేపర్లలో నిజానిజాలను తెలుసుకునేందుకు ఆర్టీఏను సంప్రదించాలి. కనీసం ఐదేళ్లపాటు అదే కేటగిరీ వాహనాన్ని నడిపిన అనుభవంగల వారినే నియమించాలి. డ్రైవర్ల వివరాలు పేరెంట్స్ కమిటీకి తెలపాల్సి ఉంటుంది. బస్సు కండిషన్‌పై పాఠశాలల యాజమాన్యాలు, పేరెంట్ కమిటీలు తనిఖీలు చేయాలి. ప్రతీ వాహనానికి అత్యవసర ద్వారం (ఎమర్జెన్సీ ఎగ్జిట్) కల్పించి, స్పష్టంగా రాయాలి. బస్సుల్లో అవసరమైన మందులతో కూడిన ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్ బాక్స్)ను అందుబాటులో ఉంచాలి. యాజమాన్యం బస్సుల పార్కింగ్‌కోసం విద్యాసంస్థల ఆవరణలోనే స్థలం కేటాయించాల్సి ఉంటుంది. విద్యార్థుల సంరక్షణ నిమిత్తం వారు పాఠశాలల ఆవరణలోనే బస్సులు ఎక్కడం, దిగడం చేయాలి. ప్రతీ విద్యా సంస్థ బస్సు కనీసం ఒక అటెండర్‌ను కలిగి ఉండాలి. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ బస్సు అటెండర్ బస్సును నడిపించేందుకు అనుమతించకూడదు. డ్రైవర్లకు యూనిఫాం ధరించాలి. బస్సులకు రూట్‌ప్లాన్ తప్పకుండా ఉండాలి. విద్యార్థులకు సంబంధించిన పూర్తి వివరాలకు సంబంధించిన లిస్టు ఉండాలి. బస్సు ఇంజిన్ కాంపార్ట్‌మెంట్‌లో ఒక అగ్నిమాపక యంత్రం (ఫైర్ ఎక్స్‌టింగ్విషర్) పౌడి అందుబాటులో ఉండాలి. పాఠశాల, కళాశాల బస్సు అని 100 ఎం.ఎం. సైజు అక్షరాలతో ఉండాలి. బస్సు డ్రైవర్లు ప్రతీ సంవత్సరం రవాణా శాఖ అధికారులకు నిర్వహించే పునశ్చరణ శిక్షణలో పాల్గొనాలి. ఏ విద్యా సంస్థ బస్సు అయినా సరే పరిమిత సీటింగ్ కెపాసిటీ కన్న ఎక్కువ మంది విద్యార్థులను తీసుకెళ్లకూడదు. ప్రతీ పది బస్సులకు ఒకటి అదనంగా (స్పేర్) కనీసం ఒక బస్సు కలిగి ఉండాలి. విద్యా సంస్థల యాజమాన్యం, రవాణా, పోలీసు, విద్యాశాఖ సౌజన్యంతో విద్యార్థులకు ఒకరోజు రోడ్‌సేఫ్టీ తరగతులు నిర్వహించాలి.

### స్కూల్ బస్సు యాప్

ప్రభుత్వం 'టీఎస్ స్కూల్ బస్సు' అనే యాప్‌ను ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్ ఫోన్లుగల వారు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న పక్షంలో.. ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన బస్సుల పూర్తి వివరాలను అందులో నమోదు చేశారు. పిల్లల తల్లిదండ్రులకు బస్సు డ్రైవర్ ఎవరూ? కండిషన్‌లో ఉందా? లేదా? అనే వివరాలను అందుబాటులోకి రానున్నాయి. ఈ యాప్‌పై రవాణా శాఖ అధికారులు ప్రచారాన్ని చేపడుతున్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు పాటించాల్సిన నిబంధనలపై తల్లిదండ్రులకు, డ్రైవర్లకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అన్ని పాఠశాలల్లోనూ రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## 55 గ్రామాలు.. 3,263 దరఖాస్తులు

నల్లగొండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో భాగంగా తొలిరోజైన మంగళవారం జిల్లావ్యాప్తంగా 55 గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా, 3,263 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా పెద్దసంఖ్యలో సాదాబైనామాల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మరోసారి భూభారతి కింద దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఈక్రమంలో గ్రామాల్లో సభ నిర్వహించి, భూసమస్యలపై వినతిపత్రాలు తీసుకుంటున్నారు. రైతులు సైతం తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తున్నారు.

# ఎటూ పాలుపోవడంలేదు

- ఇబ్బంది పడుతున్న పాడి రైతులు
- వ్యవసాయ, కుటుంబ అవసరాలకూ ఇబ్బందులే



మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామానికి చెందిన పైళ్ల కవిత స్థానిక సొసైటీలో సభ్యురాలు. గతంలో ఆమె ఆ సొసైటీలో సుమారు 20 లీటర్లపైన పాలు పోసేవారు. ఎండాకాలం కావడంతో పశువులు పాలు అంతగా ఇవ్వడంలేదు. ఇప్పుడు రోజు 6 లీటర్ల గేదె పాలు, ఐదు లీటర్లు ఆవు పాలు పోస్తున్నారు. వెన్న శాతాన్ని అనుసరించి గేదె పాలు లీటరు రూ.65, ఆవు పాలు లీటరు రూ.36 తీసుకుంటున్నారు. రోజుకు సుమారు రూ.570 చొప్పున మూడు నెలలకు రూ.51,300 వేల బిల్లు రావాల్సి ఉంది. 15 రోజులకు ఒకసారి బిల్లు ఇవ్వకపోవడంతో కుటుంబ ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నారు. పశువులకు దాణా కొనడానికి, ఇతర ఖర్చులకు అప్పు చేయాల్సి వస్తుంది. నాలుగేళ్లుగా బోనస్ రావడంలేదు. రూ.2లక్షలపైగా బోనస్ రావాల్సి ఉంది. మదర్ డెయిరీ బకాయి బిల్లులు చెల్లించాలని ఆమె కోరుతున్నారు. 6

- (ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

# 15 లోగా ఫిట్‌నెస్ పరీక్ష




పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్‌పై ఆర్టీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాలల నుంచి ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సుల కళాశాలలున్నాయి. నిత్యం బస్సుల్లో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. రోడ్డు ప్రమాదాల నివారణపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది. కొద్దిపాటి నిర్లక్ష్యంతో అత్యంత విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ప్రమాదాల భారిన పడిన ఎన్నో కుటుంబాలు తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

- ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులపై ఆర్టీఏ దృష్టి
- ఈ నెల 15వరకు అవకాశం

ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ లేకపోవడం, అనుభవంలేని డ్రైవర్లను నియమించడంతో జిల్లాలో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులపై ఆర్టీఏ దృష్టి సారించింది. రోడ్డు రవాణా శాఖ అధికారులు జిల్లావ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు 171 ఉండగా, ఇంటర్ కళాశాలలు 30, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో 16, ఇంజనీరింగ్, తదితర వృత్తి విద్యా కళాశాలలు 25వరకు ఉన్నాయి. ఈ విద్యా సంస్థలకు చెందిన బస్సులు 180 వరకు నడుస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల కు చెందిన బస్సులను ప్రతీ సంవత్సరం విధిగా ఫిట్‌నెస్ చేయించుకోవాలి. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబరు వరకు ఫిట్‌నెస్ చేసుకోవాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు విధిగా విద్యా సంస్థలకు చెందిన బస్సులను ఫిట్‌నెస్ చేసుకోవాలని సూచించారు. ఫిట్‌నెస్ వెంటనే చేయించుకోవాలని రవాణా శాఖ అధికారులు సంబంధిత పాఠశాలల యాజమాన్యాలకు సమాచారాన్ని అందించారు. ఈ నెల 15వ తేదీలోగా ఫిట్‌నెట్ చేసుకోవాలని గడువు విధించారు. ఈ మేరకు జిల్లాలోని..

- మిగతా 8వ పేజీలో...

### 15లోగా ఫిట్‌నెస్ చేయించాలి



ఈ నెల 15వ తేదీలోగా పాఠశాల, కళాశాలల బస్సులకు ఫిట్‌నెట్ సర్టిఫికెట్ పొందాలి. చిన్నారుల భద్రత దృష్ట్యా 15సంవత్సరాల కాలం చెల్లిన వాహనాలకు అనుమతి లేదు. ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రం లేకపోతే 15వ తేదీ తర్వాత రోడ్లపై నడిపే పాఠశాల బస్సులకు సంబంధించి ప్రత్యేక బృందాలు కేసులు నమోదు చేస్తాయి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయి.

- డీటీవో లావణ్య

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

### విచారణకు వెళ్లి వస్తూ
## హెడ్ కానిస్టేబుల్ మృత్యువాత

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృత్యువాత పడ్డారు. విధి నిర్వహణలో భాగంగా ద్విచక్ర వాహనంపై విచారణకు వెళ్లి తిరిగి పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న కనగల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ బొల్లెపల్లి సైదులుగౌడ్ మృతిచెందాడు. ఓ పిటిషన్ విచారణ నిమిత్తం ఆయన జీచెన్నారం గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో దర్వేశిపురం స్టేజీ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. 6

## శివన్నగూడెం నుంచి లిఫ్ట్ నీటిని తరలిస్తాం



డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు లిఫ్ట్ ద్వారా నీటిని అందిస్తామని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

వివరాలు 7లో

# మీ వల్లే అప్రతిష్ఠపాలు

### కేతేపల్లి రెవెన్యూ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కేతేపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కిందిస్థాయిలో మీరు చేసే పొరపాట్లతో జిల్లా యంత్రాంగం అప్రతిష్ఠపాలవుతుందని కేతేపల్లి మండల రెవెన్యూ అధికారులపై కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆగ్రహం వ్యక్తం చేశారు. భూభారతి దరఖాస్తులను పరిష్కరించడంలో మండలస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో, రైతులు పురుగుల మందు డబ్బాలతో జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణికి వస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ కేతేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సంబంధిత సమస్యలపై అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. భూభారతి చట్టం కింద ఏదేని రైతు తమ సమస్య పరిష్కారానికి ప్రజావాణికి వచ్చి ఆత్మహత్యకు యత్నిస్తే సంబంధిత మండలాల వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎవరి స్థాయిలో వారు రైతుల సమస్యలను పరిష్కరిస్తే ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావన్నారు. తక్షణం పరిష్కరించే వాటిని కూడా తాత్సారం చేస్తే రైతుల నుంచి నిరసనలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మండలంలోని 16గ్రామాల్లో ఎన్ని సర్వేనెంబర్లకు డిజిటల్ సైన్(డీఎస్) పెండింగ్ ఉందని ఇన్‌చార్జి తహసీల్దార్ మహ్మద్ అబ్దుల్‌సత్తార్‌ను ప్రశ్నించారు. ఆయన చెప్పిన సమాధానం విన్న కలెక్టర్ వాటి పరిష్కారానికి మీస్థాయిలో మీరు తీసుకున్న చర్యలేంటని ప్రశ్నించారు. అనంతరం మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిలో మీరు తక్షణం పరిష్కరించేవి ఎన్ని, జిల్లాస్థాయిలో పరిష్కారమయ్యేవి ఎన్ని ఉన్నాయని ఆరా తీశారు. సమీక్షా సమావేశంలో ఎంపీడీవో బీ.శ్రీనివారావు, ఎంఆర్ఐ ఎన్.వెంకన్న, ఏఆర్ఐ ఏ.రామచంద్రయ్య, సర్వేయర్ బీ.వెంకటేశ్వర్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో సహా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ముగింపు దశలో ధాన్యం కొనుగోళ్లు

- నేడో, రేపో డిండిలో కొనుగోళ్లతో ఆఖరు
- లక్ష్యానికి మించి ధాన్యం సేకరణ
- రాష్ట్రంలో జిల్లాకు 2వస్థానం

నల్లగొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ప్రక్రియ చివరి దశకు చేరింది. రైతు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విధంగానే జిల్లా వ్యాప్తంగా లక్ష్యానికి మించి ధాన్యాన్ని సేకరించారు. 375 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి కొనుగోళ్లు చేపట్టారు. డిండిలో మాత్రం ఆరు మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉంది. బుధ, గురువారాల్లో అక్కడి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణతో ఈ ప్రక్రియ పూర్తిగా ముగియనుంది. జిల్లాలో యాసంగిలో 5,97,729మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు గాను దాదాపు 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రాష్ట్రంలో జిల్లాను రెండవ స్థానంలో నిలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పౌరసరఫరాల సంస్థ, పౌరసరఫరాల శాఖలు ప్రణాళికబద్ధంగా ముందుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని వేగవంతంగా సేకరించాయి. మార్చి 24న జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాగా పలుమార్లు అకాలవర్షాలతో కూడా రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు.

### 84,619మంది రైతుల నుంచి

జిల్లావ్యాప్తంగా యాసంగి సీజన్‌లో ధాన్యం దిగుబడులు పెద్దఎత్తున వచ్చిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏర్పాట్లుచేశారు. ప్రభుత్వ రంగ సంస్థలో ధాన్యాన్ని విక్రయిస్తే మద్దతు ధరతో పాటు సన్న రకానికి బోనస్ కూడా వస్తున్న నేపథ్యంలో రైతులు అత్యధికంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించారు. సుమారు 5,76,208మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యంతో పాటు 23,700మెట్రిక్ టన్నులకు పైగా సన్నధాన్యాన్ని ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలుచేశాయి. మొత్తం 84,619మంది



రైతుల నుంచి ధాన్యాన్ని అధికార యంత్రాంగం కొనుగోలు చేసింది. ఇందుకు సంబంధించి రూ.1325కోట్లను రైతులకు చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో రూ.1210కోట్లకు పైగా నగదును జమచేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేపట్టాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో అధికారయంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ధాన్యాన్ని సవ్యంగా కొనుగోళ్లు చేపట్టారు. మొదట లారీలు సకాలంలో అందుబాటులోకి రాక ఎగుమతికి ఇబ్బందికావడం, మిల్లర్ల వద్ద స్థలం లేక దిగుమతి ఆలస్యం వంటి సంఘటనలు జరిగాయి. అయితే ఆ తరువాత సరైన చర్యలు చేపట్టడంతో ధాన్యం కొనుగోళ్లకు ఆటంకాలు తొలగాయి. రైతులకు సన్నరకానికి సంబంధించి బోనస్ చెల్లించాల్సి ఉంది. క్వింటాళ్లకు రూ.500ల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులకు ధాన్యం కొనుగోళ్లు, అందుకు సంబంధించిన డబ్బులను చెల్లించడం కోసం ప్రత్యేకంగా కలెక్టరేట్‌లో సెల్ ఏర్పాటు చేసి ట్రోల్ ఫ్రీ నెంబర్ కూడా అందుబాటులో ఉంచారు.

## భూసమస్యల పరిష్కారం కోసమే భూభారతి



రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరావు

చండూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎటువంటి భూసమస్యలు తలెత్తకుండా పరిష్కరించడం కోసమే ప్రభుత్వం ఈ భూభారతి పోర్టల్‌ను ప్రవేశపెట్టిందని అదనపు కలెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం తుమ్మలపల్లి గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించి, మాట్లాడారు. గ్రామాల్లో రైతులు, భూమి పట్టాదారులు తమ పాస్‌పుస్తకాలలో, భూరికార్డులలో ఎటువంటి తప్పులు ఉన్నా మరే విధమైన భూసమస్యలు ఉన్నా సదస్సులో దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. అదేవిధంగా ఈ రెవెన్యూ సదస్సులో భాగంగా మొదటిరోజు తుమ్మలపల్లి గ్రామంలో రైతుల నుంచి 17 దరఖాస్తులు, కుమ్మన్‌దానిగూడెం నుంచి 1 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ కిరణ్మయి, డిప్యూటి తహసీల్దార్ నిర్మలాదేవి తెలిపారు.

### సకల సదుపాయాలతో భవిత కేంద్రాలు

చండూరు : సకల సదుపాయాలతో భవిత కేంద్రాలను నిర్మించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. చండూరులో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థు కోసం ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న భవిత కేంద్రం పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు తగినవిధంగా కృత్యాధార పద్ధతిలో బోధనకు సకల సదుపాయాలను సమకూర్చాలని ఆదేశించారు. ఈ నెల 6వ తేదీ నుంచి 19తేదీ వరకు చేపట్టే బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచాలని సూచించారు. ఆయన వెంట చండూరు ఇన్‌చార్జి ఆర్డీవో రమణారెడ్డి, డీఈవో బిక్షపతి పాల్గొన్నారు.

# విత్తనరంగంలో స్వయం సమృద్ధి చెందాలి

- జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్స్‌లర్, ప్రొఫెసర్ ఏ.జానయ్య
- నాణ్యమైన విత్తనాలతో స్వయం సమృద్ధి

తిప్పర్తి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన విత్తనంతో ఉత్పత్తి చేస్తే తిరిగి అదే విత్తనాన్ని ఇతర రైతులకు ఇవ్వడం ద్వారా విత్తన రంగంలో స్వయం సమృద్ధి సాధించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్ ఏ జానయ్య అన్నారు. రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 'నాణ్యమైన విత్తనం-రైతు నేస్తం' పేరుతో ఫౌండేషన్ విత్తనాల పంపిణీని చేపట్టింది. ఇందులో భాగంగా మంగళవారం తిప్పర్తి మండలకేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రెండు, మూడేళ్లలో విత్తనరంగంలో విత్తనరంగంలో స్వయం సమృద్ధి సాధించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఆశయమన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో నాణ్యమైన విత్తనాలను రూపొందించి రాష్ట్రంలోని 11వేల రెవెన్యూ గ్రామాల్లోని 40వేల మంది రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ విత్తనాలతో రైతులు మంచి పంటలు పండించి వచ్చే సీజన్‌కు వారు ఆ విత్తనాలను వినియోగించుకోవడంతో పాటు ఇతర రైతులకు విత్తనం ఇస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచి దిగుబడులు పొందవచ్చన్నారు.



రైతులకు ఫౌండేషన్ సీడ్ అందజేస్తున్న వైస్‌ఛాన్స్‌లర్, ప్రొఫెసర్ జానయ్య, కలెక్టర్ ఇలా త్రిపాఠి

### నాణ్యమైన విత్తనాలతో నాణ్యమైన పంటలు

నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు రావడానికి వీలుంటుందని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని 564 రెవెన్యూ గ్రామాల్లో రైతులకు ఇన్‌పుట్ సీడ్‌ను అందజేస్తామన్నారు. జిల్లాలో 12లక్షల ఎకరాల్లో వ్యవసాయ సాగుకు అవకాశం ఉందని, అందులో భాగంగా రైతులు నకిలీ విత్తనాల బారినపడి మోసపోతున్నారని, అలా కాకుండా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా విత్తనాలు పంపిణీ చేయడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు.

### ప్రభుత్వం చొరవ చూపాలి...

రెండవ పంటలో రైతులు పప్పుధాన్యాలు, ఇతర పంటలు సాగు చేసేలా ప్రభుత్వమే చొరవ చూపాలని వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరైన కనగల్లు మండల రైతు పల్లేటి రాంరెడ్డి అన్నారు. పప్పుధాన్యాలతో పాటు ఈ ప్రాంతంలో డిమాండ్ ఉన్న కంది విత్తనాలను కూడా ప్రభుత్వం పంపిణీ చేస్తే రైతులకు మేలు జరుగుతుందని రైతు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ సంచాలకులు, శాస్త్రవేత్తలు,వ్యవసాయ అధికారులు మేలైన విత్తనం ఎంపిక,వాటి ప్రయోజనాలు, వరికి బదులుగా వేసే ప్రత్యామ్నాయ పంటలు, పురుగుమందుల వాడకం తగ్గింపు, తదితర అంశాలపై రైతులకు వివరించారు. అనంతరం కలెక్టర్ విశ్వవిద్యాలయ ఉపకులపతితో కలిసి రైతులకు వరి ఫౌండేషన్ సీడ్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్, మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, జూకూరి రమేష్, పాశం సంపత్‌రెడ్డి, ఏవో సన్నిరాజు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

### నిర్మాణ పనుల పరిశీలన...

తిప్పర్తి ప్రాథమిక పాఠశాల్లో నిర్మాణంలో ఉన్న ఎమ్మార్సీ భవనం, భవిత కేంద్రం పనులను కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. అనంతరం అనిశెట్టిదుప్పలపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సుకు హాజరై రైతులతో మాట్లాడి, వారి దరఖాస్తులను పరిశీలించారు.

## ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటం




సీపీఐ మండల మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

దేవరకొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఐ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతోందని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకొండ మండలం గొట్టిముక్కలలో నిర్వహించిన సీపీఐ దేవరకొండ మండల 14వ మహాసభలో ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యంతో కలిసి మాట్లాడారు. శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని, దున్నేవాడిదే భూమి కావాలని, శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పేదలపక్షాన సీపీఐ పోరాడుతోందన్నారు. ప్రజా సమస్యలే ఏజెండాగా నిత్యం ప్రజల ఉంటూ పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించిందన్నారు. పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తు రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెంచి ప్రజలపై భారం మోపుతోందని విమర్శించారు. ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలన్నారు. ఎస్ఎల్‌బీసీ, డిండి, పెండ్లిపాకల, నక్కలగండి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి భూనిర్వాసితులకు పునరావాసం కల్పించి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధానకార్యదర్శి పల్లె నర్సింహ, అంజయ్యనాయక్, దేప సుదర్శన్‌రెడ్డి, నూనె రామస్వామి, పల్లా సులోచన, రంగారెడ్డి, జ్యోతిబసు పాల్గొన్నారు.

### నేటి నుంచి దర్వేశిపురం
## ఎల్లమ్మ జాతర

- 6న తేదీన కళ్యాణోత్సవం, హాజరుకానున్న మంత్రులు

వివరాలు 7లో

# వానొస్తే వరదే(నా)?

- మిర్యాలగూడలో కొన్నేళ్లుగా యూడీసీ పనులు
- అస్తవ్యస్త మురుగు కాల్వలతో వీధుల్లోకి వాననీరు

చిన్నపాటి వర్షానికే మిర్యాలగూడ, దేవరకొండ పట్టణాల్లోని పలు ప్రాంతాల్లో వరద ముంపునకు గురవుతున్నాయి. మిర్యాలగూడలోని షాబూనగర్, సుందర్‌నగర్, తాళ్లగడ్డ, బంగారుగడ్డ, సీతారాంపురం, ఇందిరమ్మ కాలనీలు చిన్నపాటి వర్షాలకే జలమయమవుతున్నాయి. ఆయా కాలనీలలోని ఇళ్లలోకి వరద నీరు చేరుతుండగా వీధులు నదులను తలపిస్తుంటాయి. అదేవిధంగా దేవరకొండలోని రామాలయం వీధి, పాత కూరగాయల మార్కెట్ కాలనీవాసులు పరిస్థితి అంతే. వర్షాకాలం సమీపించడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముందస్తు చర్యలు చేపట్టకుంటే వానస్తే మళ్లీ వరద ముంపు తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వివరాలు 8లో



దేవరకొండలో చెత్తాచెదారంతో నిండిన స్వర్ణముఖి కాల్వ

# గీత వృత్తిని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి

నల్లగొండ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గీత వృత్తిని ఆధారం చేసుకొని జీవిస్తున్న వారికి ఆ వృత్తిని నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వాలు తీరని అన్యాయం చేస్తున్నాయని గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి విమర్శించారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాలను వెంటనే విడుదల చేయాలన్నారు. వన పెంపకంలో తాటి ఈత ఖర్జూర చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను అరికట్టాలన్నారు. ట్యాంక్ బండ్‌పై స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఎంపీ ధర్మబిక్షం విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలోని నీరా ప్రాజెక్టును పునరుద్ధరించి, ధర్మభిక్షం పేరు పెట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల ఐడెంటిటీ కార్డులు, లైసెన్సులను వెంటనే జారీ చేయాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు మాట్లాడుతూ చనిపోయిన గీతా కార్మికుల పెన్షన్‌ను భార్యలకు వితంతు పింఛనుగా మార్చి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి సురిగి చలపతి, నాయకులు వనం వెంకన్న, నకిరికంటి స్వామి, లెనిన్, అక్కలయ్య పాల్గొన్నారు.

### సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శిగా నాగయ్య

వేములపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సీపీఐ వేములపల్లి గ్రామశాఖ కార్యదర్శిగా పుట్టల నాగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జిల్లా యాదగిరి, గ్రామ సహాయ కార్యదర్శి పట్ల కృష్ణ, నాయకులు జడ భీమయ్య, బస్కు పరమేష్, మాతంగి సత్యం, వల్లంపట్ల సుధాకర్, సంపత్, మహేష్ పాల్గొన్నారు.

### బీజేపీ మండల అధ్యక్షుడిగా భరత్‌కుమార్

కొండమల్లేపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కొండమల్లేపల్లి మండలాధ్యక్షుడిగా భూతరాజు భరత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాగా తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి, మాజీ మండల లాధ్యక్షుడు సాంబశివగౌడ్, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



# వానొస్తే వరదే(నా)..?

పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా ఉంది మిర్యాలగూడ పట్టణ పరిస్థితి. పాలకులు నిర్లక్ష్యం, అధికారుల తప్పుడు అంచనాలు పట్టణ వాసుల పాలిటశాపంగా మారాయి. పట్టణంలో చిన్నపాటి వర్షాలకే చిత్తడవుతోంది. ఎప్పుడో ఒకసారి కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు వరదనీట మునగడం తెలిసిందే. కానీ కురిసిన కొద్దిపాటి వర్షాలకే డ్రైనేజీలు పొంగి పొర్లడం, రోడ్లు మునిగిపోవడం సాధారణంగా మారింది.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్,)

- కొద్దిపాటి వర్షాలకే కాలనీలన్నీ జలమయం..
- పుష్కరకాలం దాటినా పూర్తి కాని యూజీడీ పనులు

పట్టణంలో లోతట్టు ప్రాంతాలైన షాబూనగర్, సుందర్‌నగర్, తాళ్లగడ్డ, బంగారుగడ్డ, సీతారాంపురం, ఇందిరమ్మ కాలనీలు చిన్నపాటి వర్షాలకే జలమయమవుతున్నాయి. ఆయా కాలనీలలోని ఇళ్లలోకి వరదనీరు చేరుతుండగా వీధులు నదుల ను తలపిస్తుంటాయి. ఇక ముత్తిరెడ్డికుంట, రవీంద్రనగర్, బంగారుగడ్డలోని పలు రహదారుల్లో భారీగా వరదనీరు నిలుస్తోంది. గుంటూరు రోడ్డులోని మెదర కాలనీలో వారం రోజుల పాటు వర్షపు నీరు నిలుస్తుండగా సమీపంలోని సంక్షేమ భవనంలోకి నీరు చేరి విద్యార్థినులు ప్రతీ సీజన్‌లో ఇబ్బంది పడుతుంటారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన ప్రవేశం వద్ద వర్షం కురిసిన ప్రతిసారీ వరదనీరు నిలుస్తుండగా ప్రయాణికులు మరోమార్గాన వెళ్తుంటారు. గాంధీపార్కు, తాళ్లగడ్డ, షాబూనగర్ పాఠశాలల్లో వదర నీరు చేరుతుండగా, విద్యుత్ కార్యాలయం, సబ్‌స్టేషన్లలో వర్షపు నీరు నిలుస్తోంది. రాజీవ్‌చౌక్‌లో భారీగా వరదనీరు చేరడంతో వాహనదారులు పడరాని పాట్లు పడుతుంటారు వర్షాకాలంలో. గతేడాది కురిసిన సాధారణ వర్షాలకు చిన్న చెరువు ఒడ్డునున్న హిందూ శ్మశాన వాటికలోకి వరదనీరు చేరగా అస్థికలు కొట్టుకుపోవడం గమనార్హం.

#### ఆక్రమణల కారణంగా..

ఆక్రమణలతో అవస్థలు తప్పడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. పట్టణంలోని ప్రధాన నాలాతో పాటు హనుమాన్‌పేట, విద్యానగర్, మేదరి కాలనీలలోని ప్రధాన కాల్వలను ఆక్రమిం చి నిర్మాణాలు చేపట్టడంతో వర్షపు నీరు లయతప్పుతోంది. ఎవరికి వారుగా నిబంధనలు ఉల్లంఘించి పిల్ల కాల్వలు, డ్రైన్లను ఆక్రమించిన నిర్మాణాలు చేపట్టడంతో వర్షం కురిసిన ప్రతిసారి వరదనీరు కాలనీలు, వీధుల్లో చేరుతోంది. దీంతో ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయా కాలనీల ప్రజలు గొగ్గోలు పెడతున్నారు.

#### యూజీడీ పనులు పూర్తికాకపోవడంతో..

పట్టణంలో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు దశాబ్దన్నర కాలంగా కొనసాగుతున్నాయి. అధికారుల తప్పుడు అంచనాలతో గతంలో చేపట్టిన పనులు విఫలం కావడంతో అమృత్ నిధులతో పబ్లిక్ హెల్త్ పనులను పునఃప్రారంభించింది. అయితే ఆయా పనులు చేయాలా... వద్దా.. అన్నట్లు నత్తనడక సాగుతున్నట్లు ప్రజా సంఘాల నాయకులు వాపోతున్నారు. పనులు పూర్తయ్యేదెప్పుడో పట్టణం బాగుపడేదెప్పుడో అని ఎదురుచూస్తున్నారు.

#### నాలాలు నిండిపోవడంతో..

ఇక పట్టణంలోని ప్రధాన నాలాలు వ్యర్థాలతో నిండిపోవడంతో వరదనీరు వీధులు, కాలనీల్లోకి చేరుతోంది. సీతారాంపురం, బంగారుగడ్డ, సుందర్‌నగర్, హనుమాన్‌పేట, రెడ్డీకాలనీ, షాబూనగర్ తదితర ప్రాంతాల మీదుగా ప్రవహించే నాలాలలో పూడిక నిండి, మొక్కలు చెట్లుగా ఎదిగాయి. అయితే ఇటీవల నాలాల్లో పూడికతీత పనులు ప్రారంభించడంతో వరదముప్పు నుంచి ఈ సీజన్‌లో కొంతమేరయినా ఉపశమనం లభిస్తుందేమో చూడలంటున్నారు ప్రజలు.

#### ముందస్తు చర్యలు చేపట్టాం



వర్షాలు, వరదలను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాం. గతానుభావాలను బట్టి లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. వరదనీరు సాఫీగా ప్రవహించేలా ప్రధాన నాలాలో పూడికతీత చేపట్టాం. డ్రైనేజీ కాల్వలను శుభ్రపరచడంతో పా టు నాలాల ఆక్రమణలను తొలగించాం. 14 రెవెన్యూ టీమ్‌లను సిద్ధం చేయడంతో పాటు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశాం.

-మహ్మద్ యుసుఫ్,
మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ



మిర్యాలగూడ అంతర్గత రహదారిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు (ఫైల్)

## దేవరకొండలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ



దేవరకొండ : దేవరకొండ మునిసిపాలిటిలో 20 వార్డులు ఉన్నా యి. 60వేలకుపైగా జనాభా నివసిస్తున్నారు. పట్టణంలోని 3.3 కిలోమీటర్ల మేర డ్రైనేజీ కాలువలు ఉన్నాయి. అందులో స్వర్ణముఖి కాలువ, ముత్యాలమ్మబజార్, డ్రైనేజీల్లో మురుగు, చెత్తతో పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. వర్షాలు కురిస్తే డ్రైనేజీలు నిండి వర్షపునీరు ఇళ్లలోకి పారుతుందని, దీంతో అవస్థలుపడే పరిస్థితి ఏర్పడుతుందని రామాలయం వీధి, పాత కూరగాయల మార్కెట్ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది రూ.7.5 లక్షల వ్యయంతో డ్రైనేజీ కాల్వల పూడికతీసే కార్యక్రమం చేపట్టారు. ఈ ఏడాది కూడ డ్రైనేజీ కాలువల పూడికతీతకు రూ. 8.50 లక్షలు మంజూరైనట్లు, ఈనెల 6న టెండర్లు పిలిచి పూడుకుపోయిన కాలువలను పూడికతీత, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మునిసిపల్ అధికారులు తెలిపారు.

#### టెండర్లు పిలిచి కాలువలను శుభ్రం చేయిస్తాం



దేవరకొండ మున్సిపాలిటిలో వంద రోజులయాక్షన్ ప్లాన్‌లో భాగంగా జూన్ 6న టెండర్లు పిలిచి డ్రైనేజీలను శుభ్రపరుస్తాం. లోతట్టు ప్రాంతాలలో వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం. వర్షాలు వస్తే ప్రమాదాలు జరిగిన సంఘటనలు లేవు. పట్టణ ప్రజలు వర్షాలకు ఎలాంటి ఇబ్బందులుపడకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

- సుదర్శన్, దేవరకొండ మునిసిపల్ కమిషనర్

## 15లోగా 'ఫిట్‌నెస్' పరీక్ష

(5వపేజీ తరువాయి)

పాఠశాలల యాజమాన్యాలు, డ్రైవర్లతో సమావేశాలు కూడా ఏర్పాటు చేశారు. రవాణా చట్టం ప్రకారం నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు.

#### ప్రైవేట్ విద్యా సంస్థలు పాటించాల్సిన నిబంధనలు

విద్యాసంస్థల పేరు, టెలిఫోన్ నెంబర్లు, మొబైల్ నెంబర్లు సహా పూర్తి చిరునామాను బస్సు ఎడమవైపున, ముందు భాగంలో స్పష్టంగా కన్పించేలా రాయించాలి. పాఠశాలల బస్సుల డ్రైవర్లుగా నియమించబడే వ్యక్తులకు 60 ఏళ్లకు మించి ఉండరాదు. యాజమాన్యాలు ప్రతీ బస్సు డ్రైవర్ ఆరోగ్య పట్టిక(హెల్త్‌కార్డు)ను నిర్వహించాలని, మూడు నెలలకోసారి తమ సొంత ఖర్చుపై రక్తపోటు..బీపీ, షుగర్, కంటి చూపు వంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలను ప్రతీ మూడు నెలలకోసారి చేయించాలి. రికార్డులను జాగ్రత్త పర్చాలి. డ్రైవర్లను నియమించే ముందు లైసెన్స్, ఇతర పేపర్లలో నిజానిజాలను తెలుసుకునేందకు ఆర్టీను సంప్రదించాలి. కనీసం ఐదేళ్లపాటు అదే కేటగిరీ వాహనాన్ని నడిపిన అనుభవంగల వారినే నియమించాలి. డ్రైవర్ల వివరాలు పేరెంట్స్ కమిటీకి తెలపాల్సి ఉంటుంది. ప్రతీ వాహనానికి అత్యవసర ద్వారం (ఎమర్జెన్సీ ఎగ్జిట్) కల్పించి, స్పష్టంగా రాయాలి. బస్సుల్లో అవసరమైన మందులతో కూడిన ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్ బాక్స్)ను అందుబాటులో ఉంచాలి. యాజమాన్యం బస్సుల పార్కింగ్‌కోసం విద్యాసంస్థల ఆవరణలోనే స్థలం కేటాయించాల్సి ఉంటుంది. విద్యార్థుల సంరక్షణ నిమిత్తం వారు పాఠశాలల ఆవరణలోనే బస్సులు ఎక్కడం, దిగడం చేయాలి. ప్రతీ విద్యాసంస్థ బస్సు కనీసం ఒక అటెండర్‌ను కలిగి ఉండాలి. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ బస్సు అ టెండర్ బస్సును నడిపించేందుకు అనుమతించకూడదు. డ్రైవర్లకు యూనిఫాం ధరించాలి. బస్సులకు రూట్‌ప్లాన్ తప్పకుండా ఉండాలి. విద్యార్థుల కు సంబంధించిన పూర్తి వివరాలకు సంబంధించిన లిస్టు ఉండాలి. బస్సు ఇంజిన్ కాంపార్ట్‌మెంట్‌లో ఒక అగ్నిమాపక యంత్రం (ఫైర్ ఎక్స్‌టింగ్విషర్) పొడి అందుబాటులో ఉండాలి. పాఠశాల, కళాశాల బస్సు అని 100 ఎం.ఎం. సైజు అక్షరాలతో ఉండాలి. ప్రతీ పది బస్సులకు ఒకటి అదనంగా (స్పేర్) కనీసం ఒక బస్సు కలిగి ఉండాలి. విద్యా సంస్థల యాజమాన్యం, రవాణా, పోలీ సు, విద్యాశాఖ సౌజన్యంతో విద్యార్థులకు ఒకరోజు రోడ్‌సేఫ్టీ తరగతులు నిర్వహించాలి.

#### స్కూల్ బస్సు యాప్

ప్రభుత్వం 'టీఎస్ స్కూల్ బస్సు' అనే యాప్‌ను ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్ ఫోన్లుగల వారు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న పక్షంలో... ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన బస్సుల పూర్తి వివరాలను అందులో నమోదుచేశారు. పిల్లల తల్లిదండ్రులకు బస్సు డ్రైవర్ ఎవరు? కండిషన్‌లో ఉందా? లేదా? అనే వివ రాలను అందుబాటులోకి రానున్నాయి. ఈ యాప్‌పై రవాణా శాఖ అధికారులు ప్రచారాన్ని చేపడుతున్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు పాటించాల్సిన నిబంధనలపై తల్లిదండ్రులకు, డ్రైవర్లకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అన్ని పాఠశాలల్లోనూ రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## తహసీల్దార్‌కు సన్మానం

అడవిదేవులపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రాగ్యానాయక్‌ను మంగళవారం పలువురు గిరిజన నాయకులు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో కొర్ర అశోక్‌నాయక్, లచ్చు, హాము, హాతీరాం, చాంప్ల తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



దేవరకొండ మండలం మైనంపల్లి సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి

దేవరకొండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి అన్నా రు. మండలం పద్మట్‌పల్లి, మైనంపల్లిల్లో మంగళవారం నిర్వహించిన జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సుల్లో రైతుల దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మొదటిరోజు మైనంపల్లిలో 18, పద్మట్‌పల్లిలో 80 భూఅసైన్డ్‌మెంట్ భూములకు ప ట్టా పాస్‌పుస్తకాలు ఇవ్వాలని దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ సదస్సులో దేవరకొండ సీఐ నర్సింహులు, ఎంపీడీవో డానియెల్, అధికారులు పాల్గొన్నారు.

● డిండి : మండలంలో చెర్కుపల్లి, డి. నెమలిపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తహసీల్దార్ అంబటి ఆంజనేయులు తెలిపారు. చెర్కుపల్లిలో 17 దరఖాస్తులు, డి.నెమలిపూర్‌లో 7 గురు రైతులు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. నేడు ఖానాపూర్, కందుకూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

● చందంపేట : మండల కేంద్రంలో రెవెన్యూ సదస్సును తహసీల్దార్ శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పట్టా భూమి కలిగి ఉండి ఆన్‌లైన్‌లో భూమిలేని వారికి, ధరణిలోని సమస్యలను భూభారతి 2025 చ ట్టం పరిష్కరిస్తుందన్నారు. మంగళవారం రెవెన్యూ సదస్సులో భాగంగా 94 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని విడతలవారీగా పరిష్కారం చేస్తామన్నారు. సదస్సులో నయాబ్ తహసీల్దార్ గోవర్ధన్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● చింతపల్లి : మండలంలోని నెల్వలపల్లి, వర్కాల గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. రెండు గ్రామాల్లో 47 మంది బాధితులు దరఖాస్తులు చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, డిప్యూటి తహసీల్దార్ హర్షద్, ఆర్ఐ సునీత, తదితరులు పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి : ఉమ్మడి పిఏపల్లి, గుడిపల్లి మండలాల్లో సదస్సులు నిర్వహించారు. పీఏపల్లి మండలంలోని మల్లాపురం, గుడిపల్లి మండలంలోని రోళ్లకల్లు, సూరేపల్లి గ్రామ పంచాయతీలలో నిర్వహించారు. పీఏపల్లి మండలంలో 85 దరఖాస్తులు, గుడిపల్లి మండలంలో 17 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ జయశ్రీ, మధుహాసిని తెలిపారు.

● తిరుమలగిరి(సాగర్): మండలంలోని చింతలపాలెం గ్రామంలో రెవెన్యూ సదస్సును తహసీల్దార్ అనిల్‌కుమార్ ప్రారంభించారు. గ్రామానికి చెందిన 49 దరఖాస్తులు రైతుల నుంచి వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ నాగమణి, ఆర్ఐ లక్ష్మీకాంత్, మునినాయక్ పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి :మండలంలోని చిన్నఅడిశర్లపల్లి, చెన్నంనేనిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. చెన్నంనేనిపల్లిలో 5, చిన్నఅడిశర్లపల్లిలో 24 దరఖాస్తులు రాగా మొత్తం 29 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలరాజురెడ్డి, డిప్యూటి తహసీల్దార్ ప్రశాంత్, ఆర్ఐ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

● వేములపల్లి : మండలంలోని ఆమనగల్లు గ్రామంలో ఏర్పాటు చేసిన భూభారతి రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ హేమలత పాల్గొని మాట్లాడారు. గ్రామంలో మొత్తం 168 మంది తమ భూసమస్యల పరిష్కారానికి దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు.. కార్యక్రమంలో డీటీ కోటేశ్వరి, ఆర్ఐలు మహేందర్‌రెడ్డి, స్పందన, తదితరులు పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి : మండలంలోని పాములపాడు, అభంగాపురం, నర్సింహులగూడెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులను తహసీల్దార్ సురేష్‌కుమార్ స్వీకరించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ కత్తుల సైదులు, ఆర్ఐ రేణుక, నాగయ్య, సిబ్బంది ఉన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గానికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పూల బోకే ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ఉన్నారు.

## నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు



మిర్యాలగూడ రైతులకు విత్తనాలను అందిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రైతులు మేలైన విత్తనాలను వినియోగిస్తే అధిక దిగుబడులు వస్తాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న రైతు వేదికలో నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం అనే కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు మిని కిట్స్ రూ పంలో ఉన్న వరి, పెసర విత్తన ప్యాకెట్లను అందించి మాట్లాడారు. ఈ నెల 12న ఏరువాక కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ప్రతి ఒక్క రైతు నాగలి పట్టి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, గుండు నరేందర్, షేక్ జిందా, శంకర్ రెడ్డి, శ్రీనివాస్, ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్, రైతులు పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద గల రైతువేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా పరిశోధన స్థానం నుంచి తయారుచేసిన వరి నాణ్యమైన విత్తనాలు విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎమ్. వెంకటేశ్వర్లు, శ్రీదేవి అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ తేరా మణిపాల్ రెడ్డి, ఏవో పాండు, ఏఈవో సర్దార్, జ్యోతి, ఎస్.జ్యోతి, ఎమ్.డెబోరా, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

● దామరచర్ల : మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త తాలూరి కిరణ్ బాబు, ఏవో రుషేంద్రమణిలు రైతులకు మినీ ప్యాకెట్స్ విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు 24 వరి మినీ కిట్స్, 12 పెసర విత్తనాలను అందించామని అన్నారు కార్యక్రమంలో ఏఈవోలు పార్వతి, ప్రియాంక, సైద ులు, రైతుల రావుల శ్రీను, కొదాలి ప్రభాకర్, భీమానాయక్ పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి మండలంలోని గాజీనగర్ రైతు వేదికలో ఎంపిక చేసిన రైతులకు నాణ్యామైన వరి విత్తనాలు, పెసరు విత్తనాలు పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి అందజేశారు. మండలంలోని 14 రెవెన్యూ గ్రామంలో ప్రతి గ్రామం నుంచి ఇద్దరు చొప్పున 28 మంది రైతులను ఎంపిక చేసి 10 కిలోల వరి విత్తనాలు, మరో 14 మందికి ఒక్కొక్కరికి 4 కిలోల పెసర విత్తనాలను అందజేసినట్లు తెలిపారు. విత్తనాలు పొందిన రైతులు వచ్చే ఏడాది మిగతా రైతులకు తక్కువ ధరకు విత్తనాలను అందించాలని ఏవో జానకిరాములు సూచించారు కార్యక్రమంలో ప్రొఫెసర్ లతీఫ్‌పాషా, ఏఈవోలు సురేష్, మహేష్ పాల్గొన్నారు.

● చింతపల్లి : మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు నాణ్యమైన విత్తనాలు ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ నిపుణులు ప్రముఖ డాక్టర్ సుకృత్ అందించారు. కార్యక్రమంలో ఏవో శ్రావణకుమారి, ఏఈవోలు నరసింహ, మధు, మౌనిక, అనంతలక్ష్మి, శ్రీలత, ప్రియాంక, పాల్గొన్నారు.


● తిరుమలగిరి(సాగర్): స్థానిక రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ అమలు చేస్తున్న నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రొఫెసర్ డాక్టర్ టి.సుప్రజ,, ఏవో జి.హరితతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈవోలు జ్యోతి, సుష్మిత, రామాంజనేయులు, మండలంలోని పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



కొండమల్లేపల్లిలో..

### భూ భారతితో భూసమస్యలన్నీ పరిష్కరిస్తాం

● రమణారెడ్డి, ఆర్డీవో, దేవరకొండ



ఇంటర్వ్యూ Interview

పెండింగ్ భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం 2025 తీసుకొచ్చినట్లు దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి తెలిపారు. ఈ చట్టం ద్వారా భూసమస్యలన్నీ సదస్సుల్లో పరిష్కరిస్తామని మంగళవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. (ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

**ఆంధ్రజ్యోతి:** భూభారతి చట్టం పూర్తిస్థాయిలో ఎప్పుడు వరకు అమలు చేస్తారు?

**ఆర్డీవో:** జూన్ 3 నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నాం. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు ఉదయం 9 నుంచి 4 గంటల వరకు గ్రామాల్లో అందుబాటులో ఉండి ఫిర్యాదులు స్వీకరిస్తారు.

**ఆంధ్రజ్యోతి:** చందంపేట మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఏర్పాటు చేస్తామన్న రెవెన్యూ మంత్రి హామీ ఏమైంది?

**ఆర్డీవో:** చందంపేట మండలంతోపాటు డివిజన్‌లోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ, అసైన్డ్, అటవీ భూములను సర్వే చేస్తాం. సాగులో ఉన్న రైతులందరికీ న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నాం.


**ఆంధ్రజ్యోతి:** చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లో భూములు సాగు చేస్తూ పట్టాలు రాని రైతులకు ఎలాంటి న్యాయం చేస్తారు?

**ఆర్డీవో:** సాగు చేసుకుంటున్న రైతులందరికీ భూమిపై హక్కులు కల్పించేందుకే భూభారతి చట్టం ప్రభుత్వం చేపట్టింది. విచారణ జరిపి కొన్నేళ్లుగా సాగులో ఉన్న రైతులందరికీ న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడుతున్నాం.

**ఆంధ్రజ్యోతి:** భూమి ఒకరి పేరున ఉండి, మరొకరు ఆధీనంలో ఉన్న రైతులకు ఎలాంటి న్యాయం చేస్తారు?

**ఆర్డీవో:** భూభారతి చట్టం ప్రకారం భూమి ఎవరి పేరున ఉందో సర్వే నెంబర్ల ఆధారంగా విచారణ చేస్తాం. కాస్తులో ఉన్న రైతులకే న్యాయం జరిగేలా చర్యలు చేపడుతాం. భూసమస్యలన్నీ పరిష్కరించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తుంది.

## వంద రోజుల కార్యాచరణతో సమస్యలన్నీ పరిష్కారం



దేవరకొండలో వంద రోజుల ప్రణాళికలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ సుదర్శన్

దేవరకొండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపాలిటిలో వంద రోజుల కార్యచరణ ప్రణాళిక అమలుతో వార్డుల్లో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ అన్నారు. మంగళవారం దేవరకొండ 5వ వార్డు నందీశ్వర్‌నగర్ కాలనీలో వంద రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సులో మాట్లాడారు. తడి, పొడి చెత్త ను వేర్వేరుగా సేకరించాలని కోరారు. మున్సిపాలిటి పరిధిలోని ప్రతి ఇంటికి తడి, పొడి చెత్తబుట్టలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్లాస్టిక్ వాడవద్దని, ప్లాస్టిక్ వల్ల అనార్థాలు జరుగుతాయన్నారు. ఇట్టి అవగాహన సదస్సులో మునిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్ శంకర్, రాకేష్, శక్రునాయక్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

## 'సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి'

చింతపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి):తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరుతూ చైర్మన్ చిన్నాపరెడ్డికి మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌లో ప్రతిభకనబరిచిన విద్యార్థుల తల్లిదండ్రులు ప్రగతిభవన్‌లో చైర్మన్ చిన్నాపరెడ్డిని కలిశారు. విద్యార్థుల భవిష్యత్తును పెంపొదించుటకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేందుకు చొరవ తీసుకోవాలని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల తల్లిదండ్రులు బంగారు భవిష్యత్తు కృషి చేయుటకు సహకారం అందించాలని రంగారెడ్డి కలెక్టర్ దివ్యతో కలిసి చైర్మన్ న్నాప్పరెడ్డికి వినతి పత్రం అందించారు. ఆ మేరకు ఆయన స్పందించి సైనిక్ స్కూల్ ఏర్పాటు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషిచేస్తానని ఆయన హమీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సందపట్ల రామ్‌సాగర్, లక్ష్మణ్ సాగర్, ఐలయ్య, మహేష్, స్వప్న, లావణ్య, సునీత, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.